


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAAMUDHRA
RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | ఆదివారం | 02.11.2025 | సంపుటి : 2 | సంచిక :268 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Sunday | 02.11.2025 | volume : 2 | Issue : 268 | Pages : 8 | Cost : 2/- |

విలేకరులు కావలెను
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575

# శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో ఘోరం

- స్థానిక వేంకటేశ్వరాలయంలో తొక్కిసలాట
- ఏకాదశితో భారీగా తరలివచ్చిన భక్తులు
- 9మంది మృతి.. పలువురికి గాయాలు

- క్షతగాత్రలను ఆస్పత్రికి తరలించి చికిత్స
- ఘటనపై తీవర దిగ్భాంతి వ్యక్తం చేసిన సిఎం చంద్రబాబు
- కాశీబుగ్గకు చేరుకున్న మంత్రి అచ్చన్నాయుడు



శ్రీకాకుళం, నవంబర్ 1 : శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గలో ఘోరం జరిగింది. కాశీబుగ్గలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో 9 మంది భక్తులు మృతి చెందారు. కార్తీక మాసం ఏకాదశి శనివారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శనానికి తరలి వచ్చారు. ఈ సమయంలో అకస్మాత్తుగా జనసందోహం పెరగడంతో తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ తొక్కిసలాటలో - మిగతా 2 లో..



## కాశీబుగ్గ ఘటనపై ప్రధాని దిగ్భ్రాంతి

న్యూఢిల్లీ, నవంబర్ 1 : శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం నాడు తొక్కిసలాట జరిగి 10 మంది మృతిచెందడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి - మిగతా 2 లో..

# కారు షెడ్డుకు పోయింది

## బిల్లా రంగాలు ఆటో ఎక్కారు

### బోరబండలో సిఎం రేవంత్ కార్నర్ మీటింగ్



జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారంలో రెండోరోజు సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని ప్రచారం చేపట్టారు. ఈసందర్భంగా అభివృద్ధి తదితర అంశాలతో పాటు బిఆర్ఎస్‌పై విమర్శలు గుప్పించారు. బోరబండలో నిర్వహించిన కార్నర్ మీటింగ్ లో మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. అజారుద్దీన్ ను మంత్రి చేసి మాట నిలబెట్టుకున్నానని అన్నారు. కారు షెడ్డుకు పోయింది, బిల్లా రంగాలు ఆటోల్లో తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. పీజేఆర్ చనిపోతే ఏకగ్రీవానికి బీజేపీ, బీఆర్ఎస్ ఎందుకు సహకరించలేదని ప్రశ్నించారు. ఈ దుష్ట సంస్కృతికి తెర లేపిందే బీఆర్ఎస్ కాదా అని ధ్వజమెత్తారు. 02



# నేను తెలంగాణ ప్రజల బాణాన్ని

### సామాజిక తెలంగాణ నిర్మాణం కోసం సాగుతున్నా

### జాగృతి జనం బాటలో అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యలు

కరీంనగర్,నవంబర్ 1 : జాగృతి అధ్యక్షురాలు కవిత చేపట్టిన జాగృతి జనం బాట పాదయాత్ర జిల్లా పరిధిలోఉత్సాహంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల నుంచి విశేషమైన స్పందన వస్తోందని పేర్కొన్నారు. నేను తెలంగాణ ప్రజల బాణాన్ని. ప్రజల - మిగతా 2 లో..

# పాక్‌ది కపటనీతి..

మానవ హక్కుల ఉల్లంఘనలు ఆపండి

భారత్ దౌత్యవేత్త భవిక మంగళానందన్





## మహిళా న్యాయవాదికి సైబర్ ముఠా టోకరా..

రూ.52 లక్షలు కొల్లగొట్టిన నేరస్థులు



# జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ తోక కట్ చేయడం ఖాయం

### అహనా పెళ్లంట తరహాలో రేవంత్ పాలన

- ఇచ్చిన హామీలు తుంగలో తొక్కిన నేతలు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు

హైదరాబాద్, నవంబర్ 1 : అహానా పెళ్లంట సినిమా తరహాలో రాష్ట్రంలో పరిస్థితులు ఉన్నాయని.. కోడిని వేలాడదీసి పచ్చడి మెతుకులు పెడతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు.రేవంత్ రెడ్డికి పదవి ఇచ్చిందే ప్రజలు అని.. అది మర్చిపోయి రాజులా ఫీలవుతున్నారని విమర్శించారు. జూబ్లీహిల్స్ ప్రజలు కాంగ్రెస్ తోక కత్తరించేందుకు రెడీగా ఉన్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారని అన్నారు. అసలు కాంగ్రెస్‌కు ప్రజలు ఎందుకు ఓటేయాలని ప్రశ్నించారు. తెలంగాణ టీడీపీ జనరల్ సెక్రటరీ శ్రీనివాస్ నాయుడు.. ఆయన సతీమణి, టీడీపీ నాయకురాలు సుజాతతో పాటు పలువురు నేతలు శనివారం - మిగతా 2 లో..

# దేశానికి గౌరవం తెచ్చిన ఘనత నాది

## కిషన్ రెడ్డికి క్రికెట్ అంటే తెలుసా

### నిజాలు తెలుసుకోకుండా విమర్శలా: అజారుద్దీన్



హైదరాబాద్, నవంబర్ 1 : కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి క్రికెట్ గురించి ఏం తెలుసని మంత్రి అజారుద్దీన్ ప్రశ్నించారు. కిషన్ రెడ్డికి బ్యాట్ పట్టుకోవడం కూడా రాదంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తనను విమర్శించే వాళ్లకి సమాధానం చెప్పి తన స్థాయి తగ్గించుకోలేనని చెప్పుకొచ్చారు. తనపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మాజీ క్రికెటర్, మంత్రి అజారుద్దీన్ స్పందించారు. శనివారం ఆయన తనను కలిసిన విలేకర్లతో మంత్రి మాట్లాడుతూ.. తనపై వచ్చిన - మిగతా 2 లో..



# రేపటి నుంచి తెలంగాణలో ప్రైవేటు కాలేజీల బంద్

### ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య పిలుపు

హైదరాబాద్: ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోతే.. ఈ నెల 3 నుంచి ప్రైవేటు కాలేజీల నిరవధిక బంద్ పాటిస్తామని ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య ఛైర్మన్ రమేష్ బాబు తెలిపారు. ఫతేమైదాన్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై గత 6 నెలలుగా ప్రభుత్వంతో చర్చలు జరిపి ప్రస్తుతం రూ.1200 కోట్ల ఇవ్వాలని అడిగాం. మిగిలిన బకాయిల - మిగతా 2 లో..

# నిరుద్యోగులకు ఆశ చూపి పదేళ్లు భోగం

- అహనా పెళ్ళంట సీన్ బిఆర్ఎస్‌దే
- బిఆర్ఎస్,బిజెపిలది లోపాయకారి ఒప్పందం
- కెటిఆర్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చిన పిసిసి చీఫ్

అహనా పెళ్ళంట మాట బీఆర్ఎస్ పార్టీకి సరిగ్గా సరిపోతుందని కౌంటర్ టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఇచ్చారు.సినిమాలో మాదిరి కోడిని వేలాడదీసి ఆశ చూపినట్లు నిరుద్యోగులకు ఉద్యోగాల ఆశ చూపి.. కేబినెట్‌లో ఐదేళ్లు మహిళా మంత్రి లేకుండా ప్రభుత్వం నడిపిన నీచ చరిత్ర బీఆర్ఎస్ పార్టీది అని దుయ్యబట్టారు. ఈమేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రంగా స్పందించారు.

02



# కారు షెడ్డుకు పోయింది...

(మొదటిపేజీ తరువాయి)

సీఎం రేవంత్ అన్నారు. తాడు బొంగరం లేని బీజేపీ ఇక్కడ అభివృద్ధి చేస్తామని అంటోందని ఎద్దేవా చేశారు. బోరబండలో అడిగినోళ్లందరికి రేషన్ కార్డులు ఇచ్చామని.. ఆడబిడ్డలకు ఫ్రీ బస్సు ఇస్తే బీఆర్ఎస్ కు కడుపు మండుతోందని.. ఆడబిడ్డలు పైసా లేకున్నా బస్సుల్లో ప్రయాణిస్తున్నారని అన్నారు సీఎం రేవంత్. 2014లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే.. ఐదేళ్లు మహిళా మంత్రి లేదని.. తాము అధికారంలోకి రాగానే ఇద్దరు మహిళలను మంత్రులను చేశామని అన్నారు సీఎం రేవంత్. మాగంటి గోపినాథ్ ఎప్పుడైనా అసెంబ్లీలో ప్రజాసమస్యలు ప్రస్తావించారా అని అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో సమస్యలు పరిష్కారం కావాలంటే నవీన్ యాదవ్ ను గెలిపించాలని అన్నారు సీఎం రేవంత్. సిఎం వెంట ప్రచారంలో నవీన్ యాదవ్, మంత్రి అజారుద్దీన్ ఉన్నారు.



# తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

(మొదటిపేజీ తరువాయి)

కోరారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డితో కెనడా హైకమిషనర్ క్రిస్టోఫర్ కూటర్ బృందం సభ్యులు సమావేశం అయ్యారు. ఈ భేటీలో ఐటీ, ఫార్మా, ఎయిర్‌స్పేస్, డిఫెన్స్, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో కెనడాతో భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడంపై చర్చించారు. ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను కెనడా హైకమిషనర్‌కు వివరించారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని కెనడా హైకమిషనర్‌కి సీఎం విజ్ఞప్తి చేశారు. స్టార్టప్స్, ఎడ్యుకేషన్, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్స్‌లోనూ పెట్టుబడుల పెట్టడానికి ముందుకు రావాలని సీఎం సూచించారు. ఈ సమావేశంలో కెనడా మినిస్టర్ ఎడ్ జాగర్ , ట్రేడ్ కమిషనర్ విక్రమ్ జైన్, కారెన్, తెలంగాణ ప్రభుత్వ స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, విష్ణువర్ధన్ రెడ్డి, అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఫ్రాన్స్ కాన్సులేట్ జనరల్ మార్క్ లామీ బృందం మర్యాదపూర్వకంగా సమావేశం అయ్యారు. ఈ భేటీలో హైదరాబాద్‌లో ఫ్రాన్స్ ఆన్ గోయింగ్ ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితిపై చర్చించారు. హైదరాబాద్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని ఫ్రాన్స్ బృంద సభ్యులని సీఎం కోరారు. హైదరాబాద్‌లో ఫ్రెంచ్ బ్యూరో కార్యాలయాన్ని మరింత బలోపేతం చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మోద్ మిక్స్వా, తెలంగాణ ప్రభుత్వ స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, విష్ణువర్ధన్ రెడ్డి, అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రేపటి నుంచి తెలంగాణలో ప్రైవేటు కాలేజీల బంద్

(మొదటిపేజీ తరువాయి)

చెల్లింపులపై రోడ్ మ్యాప్ రూపొందించాలని కోరాం. కేవలం రూ.300 కోట్లు ఇచ్చారు.. ఇంకా రూ.900 కోట్లు దీపావళికి ఇవ్వాలని అడిగాం. నవంబరు ఒకటి నాటికి పెండింగ్ బకాయిలు మొత్తం ఇవ్వాలని కోరాం. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు అందరినీ కలిశాం. అధికారులు మా విజ్ఞప్తిని పెడచెవిన పెట్టారు. మమ్మల్ని ప్రభుత్వం బెదిరింపులకు గురి చేస్తోంది. మా మీద విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. రాష్ట్రంలో ఉన్న అన్ని వృత్తి విద్యా కాలేజీలు నవంబర్ 3 నుంచి నిరవధిక బంద్ చేస్తున్నాం. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి.. మంచి నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నాం. బంద్ సమయంలో పరీక్షలు వాయిదా వేయాలి. నవంబర్ 6న అన్ని కాలేజీల స్టాఫ్, సిబ్బందితో కలిసి దాదాపు లక్ష మందితో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తాం. నవంబర్ 10 లేదా 11న 10 లక్షల మంది విద్యార్థులతో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తాం. ఒకటి.. రెండు కాలేజీలకు ఎందుకు బకాయిలు చెల్లించారు. 10శాతం లంచం తీసుకొని ఇచ్చారా. ఆ కాలేజీలపై విచారణ జరపాలి. అత్యంత ఫ్రాడ్ జరిగే దగ్గర విచారణ జరపాలి. ఎమ్మెల్యేలు, అధికారుల ఇళ్ల ముట్టడి చేస్తాం. విద్యార్థులు, తల్లిదండ్రులకు కలిగే అసౌకర్యానికి క్షమాపణ చెబుతున్నాం" అని రమేష్‌బాబు తెలిపారు.



# ఆ అవశేషాలు.. బందీలవి కావు : ఇజ్రాయెల్

**ఇజ్రాయెల్ :** కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా బందీల మృతదేహాలను హమాస్ సంస్థ ఇజ్రాయెల్‌కు అప్పగిస్తోంది. ఈ క్రమంలోనే ఇటీవల రెడ్‌క్రాస్ ద్వారా ముగ్గురి అవశేషాలను చేరవేసింది. అయితే, అవి బందీలకు చెందినవి కావని ఇజ్రాయెల్ తెలిపింది. రఫాలో ఇజ్రాయెల్ సైనికుడి హత్య, అనంతరం గాజాలో ఐడీఎఫ్ దాడుల్లో 100 మందికిపైగా మృతి, ఇప్పుడు అవశేషాల తారుమారు వంటి వ్యవహారాలు శాంతి ఒప్పందానికి సవాల్ విసురుతున్నాయి. ఇజ్రాయెల్ (%×ంతీఖవశ్రీ%) ఇటీవల 30 మంది పాలస్తీనీయుల మృతదేహాలను గాజాకు అప్పగించింది. అనంతరం హమాస్ గుర్తుతెలియని ముగ్గురి అవశేషాలను రెడ్‌క్రాస్ ద్వారా చేరవేసింది. అనంతరం ఇజ్రాయెల్ వాటిని పరీక్షించింది. ఆ అవశేషాలు 2023 అక్టోబరు 7నాటి దాడుల సమయంలో హమాస్‌కు బందీలుగా పట్టుబడిన వారివి కావని నిఘా వర్గాలను ఉటంకిస్తూ ఓ సైనికాధికారి పేర్కొన్నారు. ప్రధాని కార్యాలయం శనివారం ఈ విషయాన్ని ధ్రువీకరించింది. అవి బందీల అవశేషాలు కావని చెప్పింది. అవి ఎవరివో తెలియాల్సి ఉంది. మృతదేహాల అప్పగింతకు ముందు నమూనాలు అందజేసేందుకు తాము ముందుకొచ్చామని, కానీ ఇజ్రాయెల్ నిరాకరించిందని హమాస్ ఓ ప్రకటనలో తెలిపింది. అమెరికా మధ్యవర్తిత్వంతో కుదిరిన శాంతి ఒప్పందం అక్టోబరు 10న అమల్లోకి వచ్చింది. అప్పటినుంచి హమాస్ 17 మంది బందీల అవశేషాలను అప్పగించింది. మిగతా 11 మంది మృతదేహాలను తిరిగి ఇవ్వడంలో మీనమేషాలు లెక్కిస్తోంది. అప్పుడప్పుడు ఒకరిద్దరివి చొప్పున అప్పగిస్తోంది. మరోవైపు.. ఇజ్రాయెల్ ఇప్పటివరకు 225 మంది పాలస్తీనీయుల మృతదేహాలు అప్పగించింది. వాటిలో 75 భౌతిక కాయాలను మాత్రమే వారి కుటుంబాలు గుర్తించినట్లు గాజా ఆరోగ్యశాఖ తెలిపింది.

# శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో ఘోరం

(మొదటిపేజీ తరువాయి)

ఆదేశాలు జారీ చేశారు. ఆలయ భద్రతా ఏర్పాట్లలో నిర్లక్ష్యం ఉందా అనే దానిపై కూడా దర్యాప్తు కొనసాగుతుంది. ఈ తొక్కిసలాట ఘటనపై దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆరా తీశారు. అయితే, తిరుమలలో దర్శనం కాలేదని సొంతంగా పండా కుటుంబం పదేళ్ల క్రితం 12 ఎకరాల భూమిలో ఈ కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించారు. ఈరోజు కార్తీకమాసంలో వచ్చే ఏకదశి శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో రావడంతో తొక్కిసలాట జరిగింది. దీంతో రెయిలింగ్ ఊడిపోయివడంతో కిందపడ్డారు. దీంతో పిల్లలతో సహా తొమ్మిది మంది చనిపోయారు. ఆలయం దగ్గర సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఏకాదశి సందర్భంగా వేంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు భారీగా పోటెత్తారు. ఈ నేపథ్యంలోనే తొక్కిసలాట చోటుచేసుకుంది. పలువురు భక్తులు స్పృహతప్పి పడిపోయారు. ఘటనాస్థలిలో సహాయచర్యలు కొనసాగుతున్నాయి. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రులకు తరలించారు. ఈ ప్రమాదంలో ఏడుగురు ఘటనాస్థలిలోనే మృతి చెందారు. ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో 8 మంది మహిళలు, 12 ఏళ్ల బాలుడు ఉన్నారు. సుమారు 25 మంది గాయపడినట్లు సమాచారం. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతులను వై.చిన్నమ్మ, ఆర్.విజయ, ఎం.నేలమ్మ, డి.రాజేశ్వరి, సీహెచ్ పశోధామిగా గుర్తించారు. మరికొందరి వివరాలు తెలియాల్సి ఉంది.శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గ వేంకటేశ్వర ఆలయంలో జరిగిన తొక్కిసలాట ఘటన కలచివేసిందని సీఎం చంద్రబాబు అన్నారు. 'ఈ దురదృష్టకర ఘటనలో భక్తులు మరణించడం అత్యంత విషాదకరం. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. గాయాల పాలైన వారికి సత్వర చికిత్స అందించాలని అధికారులను ఆదేశించాను. ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించా ల్సిందిగా స్థానిక అధికారులను, ప్రజాప్రతినిధులను కోరాను' అని చంద్రబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఎక్స్ (ట్వీట్టర్) వేదికగా స్పందించిన ఆయన.. శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గ వెంకటేశ్వర ఆలయంలో తొక్కిసలాట ఘటన తనను బాగా కలచివేసింది.. ఈ దురదృష్టకర ఘటనలో భక్తులు మరణించడం అత్యంత విషాదకరం.. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.. ఈ తొక్కిసలాటలో గాయాల పాలైన వారికి సత్వర చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించాల్సిందిగా స్థానిక అధికారులను, ప్రజాప్రతినిధులను కోరారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది అని సీఎం చంద్రబాబు భరోసా



ఇచ్చారు. అలాగే, శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయ తొక్కిలాట దుర్ఘటనపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన గురించి అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ దురదృష్టకర ఘటనలో భక్తులు మరణించడం అత్యంత విషాదకరం అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందచేయాలని అధికారులకు ఆదేశాం.. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలగా అండగా ఉంటుందని హోం మంత్రి అనిత హామీ ఇచ్చింది. శ్రీకాకుళం జిల్లాలోని కాశీ బుగ్గ వెంకటేశ్వర ఆలయంలో తొక్కిసలాట ఘటన కలచివేసింది. ఈ దురదృష్టకర ఘటనలో భక్తులు మరణించడం అత్యంత విషాదకరం. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. గాయాల పాలైన వారికి మేలైన సత్వర చికిత్స అందించాలని అధికారులను ఆదేశించానని అన్నారు. ఆలయ తొక్కిసలాట ఘటనపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు తక్షణం మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్, ఇతర అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. నాలుగేళ్ల క్రితం ఈ ఆలయ నిర్మాణాన్ని ధర్మకర్త హరిముకుంద్‌పండా ప్రారంభించారు. 12 ఎకరాల సొంత భూమిలో ఈ ఆలయ నిర్మాణం జరిగింది. సుమారు రూ.20 కోట్లతో దీనిని నిర్మించారు. కొత్తగా నిర్మించిన ఆలయంలో మే నుంచి దర్శనాలు ప్రారంభమయ్యాయి. ప్రతి శనివారం ఈ ఆలయానికి భారీగా భక్తులు తరలివస్తారు.

# జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ తోక కట్ చేయడం ఖాయం

(మొదటిపేజీ తరువాయి)

నాడు గులాబీ పార్టీలో చేరారు. పెద్దఎత్తున బీఆర్ఎస్ పార్టీలో చేరిన ఆ నేతలకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు కేటీఆర్. వేసిన నామినేషన్ విత్‌డ్రా చేసుకొని మరీ బీఆర్ఎస్‌కు సపోర్ట్ చేస్తున్న ప్రవీణ్‌కు ఆయన అభినందనలు తెలియజేశారు. శ్రీనివాస్ నాయుడు చాలా కాలం నుంచి ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నారని.. ఐదేళ్ల కిందటే రావాల్సిన నాయకుడు ఇప్పుడు వచ్చారని అన్నారు. మన పార్టీ నుంచి గెలిచి మేయర్ అయిన వ్యక్తి ఇప్పుడు అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డే ఏ పనులు చేయట్లేదని.. ఇక మేయర్ మనకు ఏం పనులు చేస్తుందని దుయ్యబట్టారు. ఆడబిడ్డలకు తులం బంగారం ఇస్తామని గ్యారెంటీ కార్డులు ఇచ్చి అరచేతిలో స్వర్గం చూపించారన్ని ÷ర్ అయ్యారు. ఆడబిడ్డ పెళ్లికి కేసీఆర్ లక్ష రూపాయలు ఇస్తే.. తులం బంగారం కూడా ఇస్తానని చెప్పి రేవంత్ రెడ్డి మాట తప్పారని అన్నారు. ఇప్పుడు తులం బంగారం ఇవ్వకపోగా.. మెడలో గొలుసు కూడా లాక్కెళుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్రీ బస్ ఇస్తున్నామని చెప్పి భార్యకి ఫ్రీ ఇచ్చి.. భర్త నుంచి డబుల్ ఛార్జీలు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను కేసీఆర్ అమలు చేశారని.. అలాగే కేసీఆర్ కిట్ ఇచ్చారని కొనియాడారు. తమ హయాంలో ఆడపిల్ల పుడితే రూ.13వేలు, అబ్బాయి పుడితే రూ.12వేలు ఇచ్చామని గుర్తు చేశారు. ఇలా ఎన్నో కార్యక్రమాలు కేసీఆర్ హయాంలో జరిగాయని అన్నారు. కాంగ్రెస్ పాలనలో కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, రంజాన్ తోఫా, బతుకమ్మ చీరలు.. ఇలా అన్ని పథకాలు బంద్ అయ్యాయని ఆగ్రహించారు. ఎన్నికలు వస్తే ఎవరైనా ఏం చేస్తారో చెప్తారు.. కానీ బెదిరిస్తారా? అని ప్రశ్నించారు. రియల్ ఎస్టేట్ నాశనం చేశారని.. రెండేళ్లలో ఏం మంచిపని చేశారో చెప్పాలన్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటూ పేదల ఇళ్లు కూలగొడుతున్నారన్ని ÷ర్ అయ్యారు.



హైడ్రా, బుల్డోజర్ పేరుతో పేదలపై జులుం ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన ఏ ఒక్క హామీనీ ఈ ప్రభుత్వం అమలు చేయలేదని కేటీఆర్ దుయ్యబట్టారు. బీసీ, ఎస్సీ డిక్లరేషన్ అంటూ నోటికొచ్చిన 420 హామీలు ఇచ్చారని మండిపడ్డారు. మాగంటి గోపినాథ్ అనారోగ్యంతో చనిపోతే ఈ నెల 11న బైపోల్ ఎన్నిక వచ్చిందన్నారు. ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని గోపీనాథ్ భార్య మాగంటి సునీతకు కేసీఆర్ టికెట్ ఇచ్చారని చెప్పారు. భర్త చనిపోయి మాగంటి సునీత ఏడిస్తే.. దాన్ని కూడా కాంగ్రెస్ నాయకులు డ్రామా అంటున్నారని చెప్పారు. ఒక ఆడబిడ్డ ఏడిస్తే కూడా ఇంత అన్యాయంగా మాట్లాడతారా? అని ప్రశ్నించారు. ఆడబిడ్డను అవమానిస్తున్న వారికి బుద్ధి చెప్పాల్సిందేనన్నారు. అధికారంలోకి రాగానే మేయర్, ఇతర నేతలు కాంగ్రెస్‌లో చేరినా ప్రజలు తమతోనే ఉన్నారని చెప్పారు. జూబ్లీహిల్స్ విజయంతోనే బీఆర్ఎస్ జైత్రయాత్ర ప్రారంభం కావాలని.. కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాలని ఆకాంక్షించారు. ఆడబిడ్డల ఆశీర్వాదంతో మాగంటి సునీత ఘన విజయం సాధించబోతున్నారని చెప్పారు.

# కాశీబుగ్గ ఘటనపై ప్రధాని దిగ్భ్రాంతి

(మొదటిపేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. ఈ ఘటన విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన బాధాకరం. కుటుంబసభ్యులను కోల్పోయిన వారి గురించే నా ఆలోచనంతా. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నానని పేర్కొన్నారు. మృతులకు పీఎంఎన్ఆర్ఎఫ్ నుంచి రూ.2లక్షల చొప్పున, క్షతగాత్రులకు రూ.50,000 చొప్పున పరిహారం అందజేస్తామని పీఎంఓ కార్యాలయం ప్రకటించింది. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సైతం ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కాగా, తొక్కిసలాటలో పలువురు గాయపడటం, వీరిలో కొందరి పరిస్థితి తీవ్రంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. సహాయక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.



# నేను తెలంగాణ ప్రజల బాణాన్ని

(మొదటిపేజీ తరువాయి)

కోసం, సమాజం కోసం నా గొంతు వినిపిస్తూనే ఉంటానని కవిత స్పష్టం చేశారు. సామాజిక తెలంగాణ నిర్మాణం కోసం అన్ని వర్గాల వారినీ కలుపుకొని ముందుకు సాగుతున్నాం. విద్య, వైద్యం వంటి కీలక అంశాలు ఇంకా జనాల మధ్య లోతుగా చేరాల్సి ఉందని కవిత తెలిపారు. సింగరేణి సంస్థను కాపాడడంలో మాజీ సీఎం కేసీఆర్ కీలక పాత్ర పోషించారని గుర్తుచేసిన ఆమె, ఆర్టీసీ విభాగంలో ఉన్న సమస్యలపై విప్లవాత్మక ఆలోచన అవసరమని సూచించారు. సామాజిక తెలంగాణను సాకారం చేయడం మనందరి బాధ్యతని అన్నారు. తెలుగు భాషకు ప్రాచీన హోదా రావడానికి మనం అందరం కృషి చేశాం. కానీ కరీంనగర్ జిల్లాలో రోడ్ల పరిస్థితి చాలా దయనీయంగా ఉంది. కేంద్ర మంత్రి బండి సంజయ్ గారు ఈ సమస్యలపై దృష్టి పెట్టాలని వ్యాఖ్యానించారు. పంటనష్టంతో ఇబ్బంది పడుతున్న రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ హాస్టళ్లలో పిల్లలు చనిపోతే ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, గురుకుల పాఠశాలల సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు. రాష్ట్రంలో మైనారిటీ సమస్యలను పట్టించుకోవాలి. మైనారిటీ అభివృద్ధికి కనీసం రూ.2,000 కోట్లు కేటాయించాలి. ఎన్నికలు సమీపించాకే మైనారిటీలు గుర్తొచ్చాయా? అని ప్రశ్నించారు. తన రాజకీయ పరిస్థితిపై స్పందిస్తూ కవిత ఇప్పుడు నాకు ఎలాంటి బంధనాలు లేవు.. నేను ఫ్రీ బర్డ్‌ని. పర్యావరణ పరిరక్షణను మా జాగృతి ప్రాధాన్యంగా తీసుకుంటుంది. తెలంగాణలో రాజకీయ శూన్యత నెలకొంది, ప్రజల గొంతుకగా మారబోతున్నాం అని తెలిపారు. మానకొండూర్ నియోజకవర్గంలో పంటనష్టం జరిగినా, అక్కడి ఎమ్మెల్యేలు స్పందించలేదని విమర్శించారు. రాహుల్ గాంధీ ఇప్పటివరకు కార్మిక చట్టాలపై స్పందించలేదని వ్యాఖ్యానించారు. ఫిరాయింపుల ఎమ్మెల్యేలపై ప్రభుత్వం నిశ్శబ్దంగా వ్యవహరిస్తోందని కవిత పేర్కొన్నారు. తన ఎమ్మెల్సీ పదవీ రాజీనామా అంశంపై మళ్లీ చైర్మన్, స్పీకర్‌లను కలుస్తానని తెలిపారు.

# అహనా పెళ్లంట సీన్ బిఆర్ఎస్‌దే

**హైదరాబాద్, నవంబర్ 1 :** జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఓటేస్తే బీజేపీకి వేసినట్లేనని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్‌తో లోపాయికారి ఒప్పందంలో భాగంగానే జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీజేపీ ప్రాధాన్యత లేని అభ్యర్థిని నిలబెట్టిందని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలు ఒక్కటేనని ఘాటు వ్యాఖ్యలు చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 8 సీట్లు గెలవడానికి బీఆర్ఎస్ సహకరించిందని ఆరోపించించారు. ఈ మేరకు మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ రుణం తీర్చుకోవడానికి బీజేపీ ప్రాధాన్యత లేని అభ్యర్థిని నిలబెట్టిందని దుయ్యబట్టారు.



ఎన్డీఏ ప్రభుత్వం ప్రతి నిర్ణయంలో గులాబీ బాస్, మాజీ సీఎం కేసీఆర్ పాత్ర ఉందని ఆరోపించారు. రాష్ట్రపతి అధ్యక్ష పదవిని నుంచి మొదలుకొని ట్రిపుల్ తలాక్ వరకు బీజేపీకి కేసీఆర్ మద్దతు ఇచ్చారని అన్నారు. డబ్బుతో ఓట్లను కొలవడమనేది అనైతిక చర్య అని పేర్కొన్నారు. కాంగ్రెస్ వాళ్ళు ఇచ్చే రూ.5 వేలు తీసుకోండి.. బీఆర్ఎస్ పార్టీకి ఓటేయండి? అంటూ కేటీఆర్ మాట్లాడటం ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించే చర్యగా పేర్కొన్నారు. ఎలక్షన్ కమిషన్ తక్షణమే కేటీఆర్ పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను మెజార్టీ అమలు చేశామన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీలు అమలు చేసి ఓట్లు అడుగుతుందని వ్యాఖ్యానించారు. రాష్ట్రం వస్తే ఉద్యోగాలు వస్తాయని అమాయకులైన నిరుద్యోగులను బలిగొన్న చరిత్ర బీఆర్ఎస్ పార్టీదని ఫైర్ అయ్యారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబంలో వారికి మాత్రమే ఉద్యోగాలు వచ్చాయని మండిపడ్డారు.బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒకటేనని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. గత ఎన్నికల్లో బీజేపీకి బీఆర్ఎస్ సాయం చేసిందని.. ఆ రుణాన్ని బీజేపీ ఇప్పుడు తీర్చుకుంటుందని ఆరోపించారు. అందుకే జూబ్లీహిల్స్ ఎన్నికలో బీజేపీ డమ్మీ క్యాండిడేట్ ను పెట్టిందని విమర్శించారు. యూసుఫ్ గూడలో ఏర్పాటు చేసిన మీటింగ్‌లో ఆయన బీజేపీ, బీఆర్ఎస్ పై తీవ్ర విమర్శలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఫేక్ హామీలతో మోసం చేసిందని అన్నారు. ఎంతమందికి రేషన్ కార్డులు ఇచ్చారో చెప్పాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 4 లక్షల రేషన్ కార్డులు ఇచ్చామని చెప్పారు. ఐదేండ్లు మీ మంత్రి వర్గంలో మహిళా మంత్రి ఎందుకు లేరో చెప్పాలని ప్రశ్నించారు. రెండు పార్టీల మధ్య ఉన్న లోపాయి కారి ఒప్పందంతోనే బీజేపీ డమ్మీ అభ్యర్థిని పెట్టిందని ఆరోపించారు. మహిళలకు ఉచిత బస్ ప్రయాణం కల్పిస్తే విమర్శిచడేంటని మండిపడ్డారు.



# కిషన్ రెడ్డికి క్రికెట్ అంటే తెలుసా?

(మొదటిపేజీ తరువాయి)

ఆరోపణలపై కోర్టు క్లీన్ చిట్ ఇచ్చిందని గుర్తుచేశారు. ఇది ఎవరైనా తెలుసుకోవాలన్నరు. విమర్శలు చేయడం కాదు.. నిజాలు కూడా తెలుసుకోవాలన్నారు. దేశ గొప్పతనాన్ని ప్రపంపచానికి చాటిన తాను దేశ ద్రోహినా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల కోసమే బీజేపీ తనను ర్గెట్ చేసిందని ఆరోపించారు. మంత్రిగా జూబ్లీహిల్స్‌లో అడుగుపెట్టిన తనను ప్రజలు ఆదరించారని.. ఇందుకు ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. విమర్శించిన వాళ్ళకి సమాధానం చెప్పదల్చుకోలేదని మంత్రి అజారుద్దీన్ స్పష్టం చేశారు. కాగా.. అజారుద్దీన్‌పై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. అజారుద్దీన్ దేశ ద్రోహానికి పాల్పడ్డారని, భారత్‌కు చెడ్డపేరు తెచ్చారని విమర్శించారు. ఆయనపై అనేక కేసులు ఉన్నాయని.. అలాంటి వ్యక్తికి కాంగ్రెస్ పార్టీ మంత్రి పదవి ఇవ్వడం ప్రజాస్వామ్యానికి అవమాన కరమన్నారు. అజారుద్దీన్ దేశ గౌరవానికి భంగం కలిగించారంటూ కిషన్ రెడ్డి చేసిన కామెంట్స్ చర్చనీయాంశంగా మారాయి.

# కేటీఆర్‌వి అహంకాపూరిత వ్యాఖ్యలు

- ఆయనపై ఈసీ సుమోటో కేసు పెట్టాలి
- అక్రమ సంపాదనతో కేటీఆర్‌లో అహం
- జూబ్లీహిల్స్‌లో నవీన్ యాదవ్ గెలుపు ఖాయం
- మంత్రి పొన్నం ప్రభాకర్ ధీమా



**హైదరాబాద్, నవంబర్ 1 :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల వేడి రోజురోజుకీ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు. పది సంవత్సరాల పాలనలో అక్రమంగా సంపాదించిన అహంతో, ఓటర్లను కొనుగోలు చేసే ప్రయత్నం చేయడం తగదని ఆయన విమర్శించారు. ఓటు కి 5 వేల రూపాయలు అడుక్కోండి అని చెప్పడం అక్షేపణీయం అని వ్యాఖ్యానించిన ఆయన, ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్ సుమోటోగా తీసుకుని కేటీఆర్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. హుజురాబాద్ ఉప ఎన్నికల్లో ఓటుకు ఆరు వేలు ఇచ్చిన సంస్కృతి కేటీఆర్‌దేనని పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ అన్నారు. ఇప్పుడు అదే పద్ధతిలో జూబ్లీహిల్స్‌లో ప్రయత్నిస్తున్నారు. కానీ జూబ్లీహిల్స్ ప్రజలు ఆలోచన కలిగినవారు. వారు డబ్బు రాజకీయాలకు లోనుకావు. కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో మాదిరిగానే కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. మా ప్రభుత్వం ప్రజా పాలన ప్రభుత్వంగా పనిచేస్తోంది. ప్రజలకు న్యాయం చేయాలనే ఆలోచనతోనే పథకాలు అమలు చేస్తున్నాం. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కి గ్యాస్, నూతన రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వడ్డీ లేని రుణాలు, కొత్త ఉద్యోగాల కల్పన.. ఇవన్నీ మా నిబద్ధతను ప్రతిబింబిస్తాయని తెలిపారు. అంతేకాకుండా, హైదరాబాద్ అభివృద్ధి కోసం ప్రభుత్వం డ్రింకింగ్ వాటర్, డ్రైనేజీ, రోడ్లు, మౌలిక వసతులపై భారీగా ఖర్చు చేస్తోందని వివరించారు. బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కయి కాంగ్రెస్‌ను ఎదుర్కోవడానికి ప్రయత్నిస్తున్నాయని మంత్రి ఆరోపించారు. బీజేపీ మూడు అంకెలు దాటని వ్యక్తిని అభ్యర్థిగా పెట్టింది. మీరు బీజేపీకి వేసిన ఓటు బీఆర్ఎస్‌కే వెళ్తుంది, బీఆర్ఎస్‌కి వేసిన ఓటు బీజేపీకే వెళ్తుంది. అందుకే జూబ్లీహిల్స్ అభివృద్ధి కోసం కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించండని ఆయన పిలుపునిచ్చారు.



## సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన సుదర్శన్ రెడ్డి

**హైదరాబాద్, నవంబరు 1 :** ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శనివారం రాష్ట్ర సచివాలయంలో సుదర్శన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు సుదర్శన్ రెడ్డి. అలాగే, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఇతర నేతలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

## 3నుంచి మెట్రో వేళల్లో మార్పులు



**హైదరాబాద్, నవంబర్ 1 :** ఈ నెల 3 నుంచి హైదరాబాద్ మెట్రో రైలు ప్రయాణ వేళల్లో మార్పులు చేసినట్టు ఆ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11గంటల వరకు అన్ని టెర్మినల్స్‌లో అన్ని రోజుల్లో ప్రయాణ సదుపాయం ఉంటుందని మెట్రో రైలు యాజమాన్యం తెలిపింది. ప్రస్తుతం అమల్లో ఉన్న మెట్రో రైలు వేళలు గమనిస్తే.. సోమవారం నుంచి శుక్రవారం: ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11.45 వరకు., శనివారం: ఉదయం 6గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు., ఆదివారం: ఉదయం 7 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు. సర్వీసులు అందుబాటులో ఉంటాయి.

## యాదాద్రిలో అమ్మవారికి లక్షపుష్పార్చన

**యాదగిరి గుట్ట,నవంబర్ 1 :** ప్రముఖ పుణ్య క్షేత్రంమైన యాదాద్రి శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారి సన్నిధిలో శనివారం ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని అమ్మవార్లకు ఉత్సవ మూర్తులకు వివిధ రకాల పుష్పాలతో లక్ష పుష్పార్చన పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు. వివిధ రకాల పుష్పాలతో స్వామివారికి అర్చన చేశారు. ప్రత్యేక మంగళహారతితో స్వామివారిని కొలిచారు. లక్ష పుష్పార్చన పూజలను ప్రతి మాసంలో శుద్ధ ఏకాదశి, బహుళ ఏకాదశి రోజున నిర్వహించడం ఆనవాయితీ వస్తుందని అర్చకులు తెలిపారు. ఈ పుష్పార్చన పూజలో స్థానికులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అదే విధంగా కార్తికమాసం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు దీపారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మహిళ మృతదేహం

**నిజామాబాద్, నవంబర్ 1 :** నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం మిట్టాపూర్ శివారులో గుర్తుతెలియని మహిళ దారుణ హత్యకు గురైంది. మృతదేహానికి తల లేదు, చేతుల వేళ్లు సగం వరకు తెగి ఉన్నాయి. మహిళ మృతదేహాన్ని బాసర ప్రధాన రహదారి పక్కన స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు సంఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. మహిళ వయసు 30 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతదేహం వివస్త్రగా ఉండటంతో అత్యాచారం చేసి హత్య చేసినట్లు అనుమానిస్తున్నారు. వేరే ప్రాంతంలో చంపి ఇక్కడ పడేశారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని పోలీసు కమిషనర్ సాయి చైతన్య పరిశీలించారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఓట్లు వేయకుంటే పథకాలు ఆపుతారా

- బెదిరింపు రాజకీయాలు సహించేది లేదు
- సిఎం రేవంత్ తీరుపై మండిపడ్డ తలసాని



**హైదరాబాద్, నవంబర్ 1 :** రేవంత్ రెడ్డి అలవాట్లు అందరికి ఉండవని, ప్రజలను భయపెడితే చూస్తూ ఊరుకోమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే,మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు. తెలంగాణ భవన్‌లో పలువురు బీఆర్ఎస్ నాయకులతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయకపోతే పథకాలు ఆగుతాయని అన్నారని.. ప్రజలను రేవంత్ రెడ్డి భయపెడుతున్నారా? అని ప్రశ్నించారు. సంక్షేమ పథకాలు ఆగితే పోరాటం ఎలా చేయాలో తమకు తెలుసు అని చెప్పారు. అసెంబ్లీని ఏ విధంగా స్తంభింపచేయాలో కూడా తెలుసు అని అన్నారు. అసెంబ్లీలో మాట్లాడకుండా పనిచేసే ఎమ్మెల్యేలు చాలామంది ఉన్నారని అన్నారు. మాగంటి గోపీనాథ్ జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారని చెప్పారు. ఆయన చివరి వరకు ప్రజల్లో ఉన్నారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా కాశీబుగ్గ తొక్కిసలాటలో చనిపోయిన భక్తులకు మాజీ మంత్రి సంతాపం తెలిపారు. రేవంత్ రెడ్డి ఇప్పటికైనా భాష మార్చుకోవాలని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి ధైర్యం ఉంటే ఒపీనియన్ పోల్‌కు సిద్ధం కావాలని సవాల్ విసిరారు. 23 నెలల్లో రేవంత్ రెడ్డి హైదరాబాద్ నగరంలో ఎక్కడ తిరిగారో చెప్పాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో రూ. 44 వేల కోట్లు హైదరాబాద్ నగరంలో ఖర్చు పెట్టామని.. కాంగ్రెస్ కేవలం రూ. 4,600 కోట్లు మాత్రమే ఉమ్మడి రాష్ట్రంలో ఖర్చు పెట్టిందని చెప్పారు. హైదరాబాద్ నగరంలో ఒక్క ఇందిరమ్మ ఇళ్ళు అయినా కట్టారా? అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లో ఉన్నారా? లేక వేరే దేశంలో ఉన్నారా? అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆడబిడ్డలకు తులం బంగారం, వృద్ధులకు, మహిళలకు పింఛన్లు ఇస్తామన్న రేవంత్ రెడ్డిని ఎక్కడ కట్టేయాలన్ని ఫైర్ అయ్యారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలిచిన తర్వాత 4 వేల కోట్ల రూపాయల అభివృద్ధి జరిగిందని నిరూపిస్తే రాజీనామాకు తాను సిద్ధంగా ఉన్నట్లు సవాల్ విసిరారు. బీఆర్ఎస్ డిమాండ్‌తోనే అజారుద్దీన్‌కు మంత్రి పదవి వచ్చిందని చెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఓటమి భయంతోనే అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ముస్లింలకు మంత్రి పదవి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. 23 నెలల్లో రేవంత్ రెడ్డి పాలనపై చర్చకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఎన్టీఆర్‌కు మాగంటి గోపీనాథ్ వీరాభిమాని అని.. ఎన్టీఆర్‌తో కలిసి మాగంటి గోపీనాథ్ తిరిగారని గుర్తు చేశారు. కమ్మ సామాజికవర్గం ఓట్ల కోసం ఎన్టీఆర్ విగ్రహం గురించి మాట్లాడారని చెప్పారు. సన్నబియ్యం, రేషన్ కార్డులు తప్ప సీఎం రేవంత్ రెడ్డి ఏం మాట్లాడటం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో రేషన్ కార్డులు ఇవ్వలేదని నిరూపిస్తే తాను రాజీనామాకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. అన్నపూర్ణ అంటే కేసీఆర్ కుటుంబం పేరు కాదు కదా.. అన్నపూర్ణ క్యాంటీన్ల పేరును ఇందిరమ్మ క్యాంటీన్లుగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశానికి రెండవ రాజధాని నగరం స్థాయిలో హైదరాబాద్ అభివృద్ధి చెందిందని చెప్పారు. ప్రభుత్వాన్ని సర్కస్ కంపెనీలా నడిపిస్తున్నారన్ని ఫైర్ అయ్యారు. భయంతోనే అజారుద్దీన్‌ను మంత్రివర్గంలోకి తీసుకున్నారని దుయ్యబట్టారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో రూ. 4 వేల కోట్ల అభివృద్ధి ఎక్కడ

# పెట్రేగిపోతున్న కామాంధులు

- పారిశుద్ధ్య కార్మికురాలిపై అత్యాచారం
- బాలికపై సామూహిక అత్యాచారం



**హైదరాబాద్, నవంబర్ 1 :** అత్యాచార ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. హైదరాబాద్ నగరంలోని బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. ఫుట్ ఓవర్ బ్రిడ్జిపై జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికురాలిపై అత్యాచారానికి పాల్పడ్డాడో కామాంధుడు. శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటన ఒకరోజు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రతీరోజు లాగే బాధితురాలు తన విధులను నిర్వహిస్తోంది. ఈ క్రమంలో ఉన్నట్టుండి ఓ వ్యక్తి ఆమెను బలవంతం చేశాడు. ఎర్రగడ్డ ఈఎస్ఐ ఆసుపత్రి సమీపంలోని ఫుట్ ఓవర్ బ్రిడ్జిపై కార్మికురాలిపై రాజు అనే వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ దారుణ ఘటనపై బాధిత మహిళ బోరబండ పోలీసులను ఆశ్రయించింది. వెంటనే కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు రాజును అదుపులోకి తీసుకున్నారు. మద్యం మత్తులో రాజు.. పారిశుద్ధ్య కార్మికురాలిపై అత్యాచారానికి పాల్పడినట్లు తెలుస్తోంది. నిందితుడు మోడల్ కాలనీలో ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్మెన్‌గా పని చేస్తున్నట్టు సమచారం. ఇదిలావుంటే ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలంలో దారుణం జరిగింది. బాలిక (13)పై సామూహిక అత్యాచార ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై అదే గ్రామానికి చెందిన ముగ్గురు అత్యాచారానికి పాల్పడ్డారు. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఓ బాలుడు వచ్చి 'నీ తమ్ముడు కింద పడిపోయాడు' అని బాలికకు మాయమాటలు చెప్పి ఓ ఇంటి వద్దకు తీసుకెళ్లాడు. ఆ తర్వాత ఇద్దరు బాలురతో కలిసి ఓ యువకుడు.. బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. బాలిక తల్లిదండ్రులు పని మీద హైదరాబాద్ వెళ్లగా, ఇంట్లో ఉన్న నానమ్మ, తాతయ్య బయటకు వెళ్లారు. బాలిక తల్లి.. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితులపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. వారికోసం గాలిస్తున్నామని అన్నారు.

## వ్యవసాయ కార్పొరేషన్ల ఆర్థికస్థితిపై నివేదిక ఇవ్వాలి : మంత్రి తుమ్మల



**హైదరాబాద్:** తెలంగాణలో వ్యవసాయ, ఉద్యాన శాఖల పరిధిలోని కార్పొరేషన్ల ఆర్థిక పరిస్థితి, ఆస్తులు, అప్పులపై పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఆయా కార్పొరేషన్లు సమర్థంగా పనిచేసేలా, రైతులకు నాణ్యమైన సేవలు అందించేలా కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. శనివారం సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ "వ్యవసాయ శాఖలో కార్పొరేషన్ల తీరు అధ్వానంగా మారింది. అవి ఉద్యోగుల జీతభత్యాలను చెల్లించలేని స్థితిలో ఉన్నాయి. ఎన్నోఏళ్లపాటు రైతులకు సేవలందించిన ఆగ్రోస్ నిరర్థకంగా మారింది. వీటన్నింటినీ ప్రక్షాళన చేస్తాం. త్వరలో ఆగ్రోస్‌ను పునరుద్ధరిస్తాం. మొంథా తుపాన్‌తో నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటాం. ఎకరానికి రూ.పది వేల పరిహారం ఇస్తామంటూ సీఎం ప్రకటించారు. దీనికి అనుగుణంగా చర్యలు తీసుకుంటాం. పత్తి రైతులు తేమ శాతం విషయంలో అప్రమత్తంగా ఉండాలి" అని సూచించారు.

## 'స్థానిక' ఓటర్ల జాబితాల నవీకరణ

**కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు**

**హైదరాబాద్:** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతలో భాగంగా గ్రామ పంచాయతీ వార్డుల వారీ ఓటర్ల జాబితాలో కొత్త ఓటర్లను మరోసారి నమోదు చేయాలని ఆదేశిస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లనూ ఆదేశిస్తూ ఉత్తర్వులిచ్చింది. గత నెల ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండి, కేంద్ర ఎన్నికల సంఘం రూపొందించే శాసనసభ నియోజకవర్గాల ఓటర్ల జాబితాలో ఈ నెల 15 వరకు నమోదయ్యే గ్రామీణ ఓటర్లను 'స్థానిక' ఎన్నికల ఓటర్ల జాబితాలో చేర్చాలంది. ప్రస్తుతం 'స్థానిక' ఎన్నికలు వాయిదా పడినా... మళ్లీ నిర్వహించాల్సి వస్తే ముందు జాగ్రత్తగా వాటికోసం ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించి తాజాగా ఆదేశాలిచ్చింది. గ్రామ పంచాయతీ వార్డుల్లో కొత్త ఓటర్ల నమోదు కోసం శాసనసభ ఓటర్ల జాబితాల్లో ఈ నెల 15 వరకు నమోదయ్యే వారి వివరాలను తమకు డిజిటల్ రూపంలో అందించాలని సీఈవో సుదర్శన్‌రెడ్డికి రాష్ట్ర ఎన్నికల సంఘం ఇటీవల లేఖ రాసింది. ఈ జాబితా రాగానే అన్ని జిల్లాలకు పంపి.. వాటి ఆధారంగా అందులోని కొత్త ఓటర్లను పంచాయతీ ఓటర్ల జాబితాలో చేరుస్తారు.

# పాక్‌కు అనుకూలంగా సిఎం వ్యాఖ్యలు

- కాంగ్రెస్‌ది ముందు నుంచీ ఇదే ధోరణి
- ఎక్స్ వేదికగా మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



**హైదరాబాద్, నవంబర్ 1 :** పాకిస్థాన్ మీద కాంగ్రెస్ పార్టీ ప్రేమ, అభిమానం అజరామరమని.. గురువు నుంచి శిష్యుడి దాకా అదే వ్యామోహం అంటూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. ఈమేరకు కాంగ్రెస్ పార్టీపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా కిషన్ రెడ్డి స్పందిస్తూ.. సర్జికల్ స్ట్రైక్స్, ఆపరేషన్ సింధూర్‌ను చులకన చేస్తూ భారతీయ సైనికుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారిపోయిందని మండిపడ్డారు. పాకిస్థాన్‌కు మద్దతుగా మాట్లాడుతూ భారత ఆర్మీని అగౌరవ పరుస్తున్నామనే సోయి లేకుండా కాంగ్రెస్ పార్టీ నేతలు మాట్లాడటం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాకిస్థాన్ వైపుకు స్టాండ్ తీసుకొని శత్రుదేశం భాషలో మాట్లాడుతూ శత్రువుల మాటలను సిగ్గు లేకుండా వల్లెవేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి రాజ్యాంగబద్ధ హోదాలో ఉండి కూడా నిజానిజాలు తెలియకుండా, దేశానికి వ్యతిరేకంగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రికి తెలియని విషయం ఏంటంటే.. పాకిస్థాన్ భూభాగంలో దాక్కున్న ఉగ్రవాదులను, వారి స్థావరాలను భారత గైడెడ్ క్షిపణులు విజయవంతంగా మట్టుబెట్టాయని.. 11 ఎయిర్ బేస్‌లను పూర్తిగా ధ్వంసం చేశాయన్నారు. ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నాయకులు ముందు ఈ విషయాలను తెలుసుకుని మాట్లాడాలని కిషన్ రెడ్డి హితవుపలికారు.



## ఇందిరమ్మ ఇల్లు పేదవారి ఆత్మగౌరవానికి ప్రతీక

**గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**

**హైదరాబాద్,నవంబర్ 1 :** ఇందిరమ్మ ఇల్లు పేదవారి ఆత్మగౌరవానికి ప్రతీక అని, అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేస్తామని తెలంగాణ గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా రెహమత్ నగర్‌లో పర్యటించిన మంత్రి.. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. పదేళ్ల పాలనలో జూబ్లీహిల్స్‌లో భారాస ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించలేక పోయిందని ఆరోపించారు. తమ అభ్యర్థి నవీన్‌కుమార్‌ను గెలిపిస్తే.. మూడేళ్ల కాలంలో ప్రజా సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. భాజపా, భారత రాష్ట్ర సమితిలను నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు.

## కాంగ్రెస్ అభయహస్తం కాదు.. భస్మాసుర హస్తం

**జూబ్లీహిల్స్ ప్రచారంలో ఎంపి రఘునందన్**



**హైదరాబాద్,నవంబర్ 1 :** అభయ హస్తం మేనిఫెస్టోలో ప్రజా దర్బార్ ను నిర్వహిస్తాం అన్నారు.. ప్రజా దర్బార్ నిర్వహించడానికే కాంగ్రెస్ కు చేతకాలేదని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కేసీఆర్ అవినీతి రూ. లక్ష కోట్లు కక్కిస్తాం అన్నారు..? ప్రజలకు పంచుతాం అన్నారు..? ఏమైందని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబం నుంచి కక్కించిన మొత్తం డబ్బు ఎంతో..? ముఖ్యమంత్రి శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జీవో 111 వెనక లక్షల కోట్ల కుంభకోణం అన్నారు.. అది ఏమైందో ముఖ్యమంత్రి చెప్పాలన్నారు. బీఆర్ఎస్ 30 శాతం కమిషన్ సర్కార్ అన్నారు. ప్రస్తుతం ఎంత కమిషన్ నడుస్తుంది ముఖ్యమంత్రి చెప్పాలి? అని నిలదీశారు. కాంగ్రెస్ అభయ హస్తం కాదు.. అది భస్మాసుర హస్తమని జూబ్లీహిల్స్ ప్రజలు గమనించాలని ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. మానిఫెస్టోలో మొదటి పేజీనే అమలుకు నోచుకోలేదన్నారు. రాష్ట్రం ఒక్క నియోజక వర్గంలో గంటేడు జాగా స్మశాన వాటిక కు ఇవ్వలేదన్నారు. కానీ షేక్ పేట్‌లో కబ్రస్థాన్‌కు ఆగమేఘాల మీద లాండ్ ఇచ్చారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీని కబ్రస్థాన్ లో పెట్టేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు.. కంటోన్మెంట్ అభివృద్ధికి రూ.4 వేల కోట్లు ఇచ్చారని ముఖ్యమంత్రి చెబుతున్నారని చెప్పారు.. అవి ఏమయ్యాయని ప్రశ్నించారు. ఎంఐఎం ఎవరి కోసం ప్రచారం చేస్తుంది.. జూబ్లీహిల్స్ ప్రజలు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

## రన్‌వేపైకి వెళ్లిన విమానంలో పొగలు

**పైలట్ అప్రమత్తతతో తప్పిన ప్రమాదం**

**శంషాబాద్ :** రన్‌వేపైకి వెళ్లిన ఇండిగో విమానంలో పొగలు వచ్చిన సంఘటన శంషాబాద్ విమానాశ్రయంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఎయిర్‌పోర్ట్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానం 206 మంది ప్రయాణికులను ఎక్కించుకొని పశ్చిమ బెంగాల్‌లోని సిలిగురికి టేకాఫ్ తీసుకోవడానికి రాత్రి 8.20 గంటలకు రన్‌వేపైకి వచ్చింది. గాలిలోకి ఎగరడానికి సిద్ధమవుతుండగా విమానంలో పొగలు రావడంతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. అప్రమత్తమైన పైలట్ వెంటనే విమానాన్ని వెనక్కి తీసుకొచ్చారు. ఇంజినీరింగ్ నిపుణులు సాంకేతిక లోపాన్ని గంటన్నరపాటు శ్రమించి సరిచేశారు. దీంతో 2 గంటలు ఆలస్యంగా బయలుదేరింది.

# తుఫాన్ బాధితులను గాలికి వదిలేస్తే ఎలా?



చెరువులు, నాలుల కబ్జాకు గురవుతున్నాయని స్వయంగా ప్రకటిస్తున్న పాలకులు అందుకు తగ్గట్లుగా చర్యలు తీసుకోవడం లేదు. కబ్జాకోరులను ప్రభుత్వాలే రక్షిస్తూ గడుసు మాటలు మాట్లాడుతున్నారు. ప్రభుత్వాలు తలచుకుంటే కబ్జారాయుళ్లను తొలగించడం నిముషంలో పని. హైడ్రా చేస్తున్న పనిని అంతటా చేయించే బాధ్యత ఉందా లేదా అన్నది సిఎం రేవంత్ రెడ్డి ఆలోచించాలి. వరంగల్ జిల్లాలో వరదనష్టం సందర్భంగా కబ్జాలపై వ్యాఖ్యలు చేసిన సిఎం, అందుకు తగ్గట్లుగా ప్రణ్శాళిక సిద్దం చేసి చిత్తశుద్దిని చాటాలి. ఉత్పాతాలు జరిగినప్పుడు తూతూ మంత్రంగా సాయం ప్రకటించడం, అందరినీ ఆదుకున్నామని చెప్పడంతో సరిపెట్టేస్తున్నారు. ఇల్లు మునిగిని వారికి 15 వేలు పరిహారంగా తెలంగాణ సిఎం ప్రకటించారు. ఈ డబ్బుతో ఏం వస్తుందో అధికారులు, సిఎం రేవంత్ రెడ్డి చెబితే బాగుండేది. దెబ్బతిన్న ఇళ్లను, రైతులను ఆదుకునేందుకు కార్యాచరణ ప్రకటించడం లేదు. ఆక్రమణలను తొలగించాలన్న దానికి కూడా ప్రణాళిక లేదు. అలాగే ఎపిలో తుపాన్‌లో అధికారులు బాగా పనిచేశారని సిఎం చంద్రబాబు సర్టిఫికెట్లు ఇచ్చారు. అధికారులు పనిచేయడం వారి విధి. జీతాలు తీసుకుంటున్నారు. అయినా వెన్నుతట్టి ప్రోత్సహిం చాల్సిందే. ఇదే సమయంలో గ్రామాల వారీగా నష్టపోయిన వారి లెక్కలు తీసుకుని ఆదుకుంటే బాగుం టుంది. ఎందుకంటే తుఫాన్లు, వరదలు వచ్చినప్పుడు సామాన్యుల జీవితాలు చిగురుటాకులా వణికిపోతు న్నాయి. వీరిని ఆదుకోవాలి. ఆదుకునే వరకు మనమంతా సంఘటితంగా ముందుకు సాగాలి. ప్రకృతి విపత్తులు చోటుచేసుకున్నప్పుడు బాధితులను అన్ని విధాల ఆదుకోవడమే అత్యంత ముఖ్యం. తుఫాన్ గండం గడిచింది కనుక గ్రామాల వారీగా తెలుగు రాష్ట్రాల్లో బాధితులను గుర్తించి వారిని ఆదుకోవాలి. పంటలను ఎంతమేరకు నష్టపోయారో లెక్కలు వేయాలి. ఎకరా పంటకు ఎంతపెట్టుబడి పెట్టారో గుర్తించాలి. అన్నదాతల విషయంలో అలసత్వం తగదు. తాజా మొంథా తుపాన్ కారణంగా వ్యవసాయం ముఖ్యంగా వరి, పత్తి తదితర పంటలకు పెద్ద ఎత్తున నష్టం జరిగింది. కోస్తాతో పాటు తెలంగాణ జిల్లాల్లో ఎక్కడ చూసినా నీట మునిగిన పైర్లు కనపడుతున్నాయి. గింజ పాలుపోసుకునే దశలో చోటుచేసుకున్న ఈ విపత్తుతో రైతాంగం దిక్కుతోచని స్థితిలో పడింది. ఏ గ్రామానికి వెళ్లినా నిండా మునిగిపోయిన తమను ఆదుకోవాలంటూ కన్నీటితో విజ్ఞప్తులు చేస్తున్న అన్నదాతలే కనిపిస్తున్నారు. కొబ్బరి, అరటి తోటలు కూడా బాగా దెబ్బతిన్నాయి. ఈ సంవత్సరం పంటల బీమా పథకం కూడా రాష్ట్రంలో అమలులో లేకపోవడం గమనార్హం. ప్రభుత్వం తన వాటా కట్టకపోవడంతో ఈ పథకం ఆగిపోయింది.

అలాగే మత్స్యకారులు తుపాన్ వల్ల దాదాపు వారం రోజులుగా వేట ఆగిపోయింది. ఉవ్వెత్తున ఎగిసిన అలల కారణంగా తీరంలో కట్టిఉంచిన బోట్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. కొన్ని చోట్ల సముద్రపు ఉధృతికి కొట్టుకుపోయినట్లు వార్తలు వస్తున్నాయి. రొయ్యల రైతులు కూడా భారీగా నష్టపోయారు. సహాయ శిబిరాల్లో చేతిలో పెట్టే కొద్దిపాటి మొత్తం బాధితుల కన్నీరు తుడవడానికి ఏమాత్రం చాలదు. బాధితులకు సత్వర సాయం అందించాలి. ఈ మేరకు అవసరమైన ఎన్యూమరేషన్‌ను వెంటనే ప్రారంభించాలి. కేంద్రం నుండి ప్రకృతి విపత్తు సాయం ఇతోధికంగా అందేట్లు చూడాలి. ప్రధాని, ముఖ్యమంత్రితో ఫోన్‌లో మాట్లాడితే చాలదు. నిధులు మంజూరు చేసి ఆదుకోవడంలో కేంద్రం ఉదారంగా ముందుకు రావాలి. పంటనష్టపోయిన రైతులను పెద్ద మనసుతో ఆదుకోవాలి. గతంలో పెనుతు-పానులు, వరదలు వచ్చినప్పుడు కూడా కేంద్ర ప్రభుత్వ స్పందన అంతంతమాత్రంగానే ఉంది. సాయం కోసం ఏళ్లతరబడి ఎదురుచూడాల్సి వచ్చింది. ఈ సారి కూడా వట్టిమాటలతో సరిపెట్టకుండా పూర్తిసాయాన్ని తక్షణమే విడుదల చేసేలా కేంద్రంపై ఒత్తిడి తేవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. ముందుగానే అంచనా వేసినట్లుగానే మొంథా అల్లకల్లోలం సృష్టించింది. ప్రత్యేకించి కోస్తా జిల్లాలన్నింటి మీద తుపాన్ తీవ్ర ప్రభావం చూపినప్పటికీ, కోనసీమ, కాకినాడ, విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో భారీ నష్టం వాటిల్లినట్లు చెబుతున్నారు. నష్టానికి సంబంధించిన పూర్తి స్థాయి నివేదికలను ప్రభుత్వం రూపొందించాల్సి ఉంది. తుపాన్ కారణంగా ప్రాణ నష్టాన్ని గణనీయంగా నివారించడం ఒక సానుకూల పరిణామం.

రాష్ట్ర వ్యాప్తంగా 40 లక్షల మంది తుపాన్ బాధితులుగా మారినట్లు, 76 వేల మందికి పైగా పునరావాస శిబిరాలకు తరలించినట్టు, తు-పాన్ కారణంగా ముగ్గురు మృతి చెందినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. గతంతో పోలిస్తే అధికార యంత్రాంగం ఈసారి మరింత అప్రమత్తంగా వ్యవహరించింది. పెనుగాలుల హెచ్చరికల నేపథ్యంలో జాతీయ రహదారిపై భారీ వాహనాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేయడం ద్వారా మంచి ఫలితాలు వచ్చాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నుండి మంత్రుల వరకు మారథాన్ సమీక్షలు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు దిశా నిర్దేశర చేశారు. రెవిన్యూ, విద్యుత్‌తో పాటు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, ఆశా, అంగన్‌వాడీ, పారామెడికల్ సిబ్బంది ప్రశంసనీయమైన కృషి చేశారు. కొందరు ఎంఎల్‌ఏలు, ప్రధాన ప్రతిపక్ష పార్టీకి చెందిన నేతలు కూడా బాధిత ప్రజల వద్దకు వెళ్లడం, వారి కష్ట నష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే ప్రయత్నం చేయడం మంచిదే. అయితే ఇదే చొరవతో ఇప్పుడు బాధితుల కన్నీళ్లు తుడవాలి. సామాన్యుల నుంచి రైతుల వరకు అనేకులు తీవ్రంగా నష్టపోయారు. వారిని గుర్తించి ఆదుకోవడం ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాల తక్షణ కర్తవ్యం.

## వరదల నష్టాన్ని అంచనా వేసి పంపండి

### కలెక్టర్లను ఆదేశించిన సిఎస్



**హైదరాబాద్, నవంబర్ 1 :** ముఖ్యమంత్రి ఆదేశాలకనుగుణంగా మొంథా తుఫాన్ ప్రభావంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేసి వెంటనే ప్రభుత్వానికి సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మొంథా తుఫాన్ ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో నేడు టెలికాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు ఈ టెలికాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 24 జిల్లాలు ఈ మొంథా తుఫాన్ కు ప్రభావితమయ్యాయని తెలిపారు. జిల్లాలలో జరిగిన పంట నష్టం తో పాటు, రహదారులు, నీటి వనరులు, పశువులు, ప్రాణ నష్టంతో పాటు ఇతర ప్రాథమిక వివరాలను వెంటనే ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశించారు. అదేవిధంగా ఇటీవల కాలంలో ఏవిధమైన సూచనలు లేకుండా 25 నుండి 30 సెంటీమీటర్ల వం-షపాతం ఆకస్మికంగా కురుస్తోందని, ఈ నేపథ్యంలో అత్యవసర సమయంలో చేపట్టాల్సిన చర్యలపై జిల్లాల వారీగా ముందస్తు ప్రణాళికలను రూపొందించుకోవాలని సి.ఎస్ సూచించారు. తుఫాన్ ప్రభావంతో ఆయా జిల్లాలలో దెబ్బతిన్న రహదారులు, విద్యుత్ లైన్లు, నీటి వనరులకు తాత్కాలిక పునరుద్ధరణ పనులు ముమ్మరంగా చేపట్టినట్టు అధికారులు పేర్కొన్నారు.

## అయితే 150.. లేదంటే 10 సీట్లు

### ప్రశాంత్ కిశోర్



**బిహార్ :** బిహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికల్లో తమ పార్టీకి 150 కంటే ఎక్కువ సీట్లు వస్తాయని ధీమా వ్యక్తంచేశారు. ఒకవేళ ప్రజలు తిరస్కరిస్తే 10 కంటే తక్కువ సీట్లకే పరిమితం కావొచ్చనే అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. ఈ మేరకు మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. అలాగే తాము ఏ పార్టీతో పొత్తు పెట్టుకోబోమని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఎన్ని సీట్లు గెలవొచ్చని అంచనా వేస్తున్నారని ప్రశాంత్ కిశోర్‌కు ప్రశ్న ఎదురైంది. "ఇక్కడ నేను రెండు అవకాశాలు ఉండొచ్చని అనుకుంటున్నాను. ప్రజలు జన్‌సురాజ్‌ను ఒక ప్రత్యామ్నాయంగా చూస్తున్నారు. అయితే దీర్ఘకాలంగా నిరాశావాదాన్ని చూసిన ఓటర్లు ముందడుగు వేయడానికి విశ్వాసం అవసరం" అని అన్నారు. "నేను ఎన్నికల్లో పోటీ చేస్తానని ఎన్నడూ ధ్రువీకరించలేదు. ఒకవేళ నేను పోటీచేస్తే.. కర్గాహర్ నుంచి బరిలో ఉంటానని చెప్పాను. నేనేమీ ఎక్స్ ఫ్యాక్టర్ కాదు. ఎన్నికల ఫలితాలు నవంబర్ 14న వెల్లడి కానున్నాయి. ఎన్నికల్లో విజయం గురించి ఆలోచించేటప్పుడు.. జన్‌సురాజ్ గెలిచిన సీట్లను చూస్తారా..? లేక నేను పోటీ చేశానా లేదా అనే దానిని చూస్తారా? బిహార్‌లో మహాగఠ్‌బంధన్ లేక ఎన్డీయేకు ప్రత్యామ్నాయం లేదనే అభిప్రాయం ఉంది. అభిప్రాయం వేరు.. వాస్తవం వేరు. బిహార్‌లో మూడింట ఒకవంతు మంది ఈ రెండు కూటములకు ఓటు వేయాలని అనుకోవడం లేదు. 160-170 సీట్లలో జన్‌సురాజ్ గట్టి పోటీ ఇస్తుందని భావిస్తున్నట్లు చెప్పారు" అని తాను పోటీ చేయకపోవడం గురించి సమాధానమిచ్చారు. అలాగే పొత్తుల గురించి మాట్లాడుతూ.. "ఈ ఎన్నికల ఫలితాల తర్వాత జన్‌సురాజ్ కింగ్ మేకర్‌గా ఎదిగినా.. వారితో పొత్తు, వీరితో పొత్తు అంటూ రాజకీయాలు చేయబోం. ప్రజలు మాకు అనుకూలంగా తీర్పు ఇవ్వకపోతే.. మా పని మేం కొనసాగిస్తాం. ఇది నేను మీకు రాసిస్తాను. ఎన్నికల ముందు, తర్వాత మేం ఎలాంటి పొత్తులు పెట్టుకోం. ఒకవేళ హంగ్ ఏర్పడి మేం లేకుండా ప్రభుత్వం ఏర్పాటుచేయలేని పరిస్థితి వస్తే.. నేతలు పార్టీలు మారతారు. అది నాకు తెలుసు. వారిని నేను ఆపలేను. డబ్బు, కేసుల భయం అందుకు కారణం కావొచ్చు" అని విమర్శించారు. రాష్ట్రంలో వచ్చేనెల 6, 11వ తేదీల్లో రెండు విడతల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. నవంబరు 14వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

## ఇంగ్లీష్, హిందీ భాషలు దక్షిణాది రాష్ట్రాల్లో పిల్లల నైపుణ్యాలను బలహీనపరుస్తున్నాయి

### హిందీ వివాదం వేళ.. సిద్ధరామయ్య కీలక వ్యాఖ్యలు



**బెంగుళూరు :** కేంద్రంలో అధికారంలో ఉన్న భాజపాకు, పలు దక్షిణాది రాష్ట్రాలకు మధ్య హిందీ భాష విషయంలో మాటల యుద్ధం నడుస్తోన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కీలక వ్యాఖ్యలు చేశారు. ఇంగ్లీష్, హిందీ భాషలు దక్షిణాది రాష్ట్రాల్లో పిల్లల నైపుణ్యాలను బలహీనపరుస్తున్నాయన్నారు. విద్యా సంస్థల్లో మాతృభాషను ప్రోత్సహించేలా కేంద్రం చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కర్ణాటకపై సవతి తల్లి వైఖరిని ప్రదర్శిస్తూ.. హిందీని తమపై బలవంతంగా రుద్దుతోందన్నారు. కర్ణాటక రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ సిద్ధరామయ్య ఈ వ్యాఖ్యలు చేశారు. అభివృద్ధి చెందిన దేశాల పిల్లలు తమ మాతృభాషలోనే నేర్చుకుంటారని.. కానీ మన దేశంలో పరిస్థితి దానికి విరుద్ధంగా ఉందని సిద్ధరామయ్య అసహనం వ్యక్తం చేశారు. ఇంగ్లీష్, హిందీ మన పిల్లల ప్రతిభను బలహీనపరుస్తున్నాయన్నారు. ఈ సమస్యను నివారించాలంటే మాతృభాషను బోధనా మాధ్యమంగా ప్రవేశపెడుతూ.. చట్టాలను తీసుకురావాలన్నారు. కన్నడ భాష దాని సంస్కృతిని కొత్త శిఖరాలకు తీసుకెళ్లాల్సిన అవసరాన్ని సిద్ధరామయ్య నొక్కి చెప్పారు. విద్య విషయంలో కన్నడ భాషపై జరుగుతున్న నిర్లక్ష్యం రాష్ట్రంలో అనేక సమస్యలకు కారణమయ్యిందన్నారు. హిందీ, సంస్కృత భాషాభివృద్ధికి నిధులు కేటాయిస్తున్న కేంద్రం.. దేశంలోని ఇతర భాషల అభివృద్ధికి మాత్రం ఎటువంటి గ్రాంట్లు మంజూరుచేయకుండా అన్యాయం చేస్తోందన్నారు. కన్నడను వ్యతిరేకించే వారిని రాష్ట్ర ప్రజలు కూడా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రం కేంద్రానికి రూ. 4. 5 లక్షల కోట్ల ఆదాయాన్ని అందిస్తున్నప్పటికీ.. భాజపా నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మాత్రం కర్ణాటక అభివృద్ధికి నిధులివ్వడానికి నిరాకరిస్తోందని ఆరోపించారు.

## ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

### ముంబైకి దారి మళ్లించిన పైలట్

**హైదరాబాద్, నవంబర్ 1:** ఇండిగో విమానాలకు తరచుగా బాంబు బెదిరింపులు రావడం తీవ్ర కలకలం రేపుతోంది. ఇటీవల కాలంలో ఇండిగో విమానంలో బాంబులు ఉన్నట్లు బెదిరింపు మెయిల్స్ రావడం.. ఆ తరువాత అదంతా ఫేక్ అని తేలడం జరుగుతూనే ఉంది. తాజాగా మరోసారి ఇండిగో విమానంలో బాంబు ఉన్నట్లుగా వచ్చిన మెయిల్ ఆందోళన కలిగిస్తోంది. శనివారం జెడ్డా నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వస్తున్న ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. దీంతో సెక్యూరిటీ అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. శంషాబాద్ విమానాశ్రయానికి రావాల్సిన విమానాన్ని ముంబాయి ఎయిర్ పోర్ట్‌కు దారి మళ్లించారు. బాంబు బెదిరింపు మె-యిల్‌పై పోలీసులకు సెక్యూరిటీ అధికారులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గత నెలలో కూడా ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు వచ్చిన విషయం తెలిసిందే. దుబాయ్ నుంచి మంగళూరు బయలుదేరిన ఇండిగో విమానం బాత్రూంలో బాంబు బెదిరింపు ఉన్న సందేశాలను ప్రయాణికులు గుర్తించి.. సిబ్బందికి తెలియజేశారు. వెంటనే అలర్ట్ అయిన విమానాశ్రయ సిబ్బంది.. విమానం మొత్తాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అయితే ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని.. అందంతా ఫేక్ అని నిర్ధారణ కావడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. కాగా.. ఇండిగో విమానాలకు పదే పదే ఇలాంటి బెదిరింపులు రావడంపై అధికారులు సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రయాణికులు భావిస్తున్నారు. ఫేక్ ప్రచారం చేస్తున్న ఆకతాయిలను వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. తరచూ ఇలాంటి సందేశాలతో భయాందోళనకు గురవుతున్నట్లు ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## మళ్లీ సీఎం కాలేనని నీతీశ్‌కు తెలుసు : విపక్షాల విమర్శలు




**బిహార్ :** ఈసారి బిహార్ ముఖ్యమంత్రి పదవిని తాను చేపట్టలేనని నీతీశ్ కుమార్‌కు తెలుసని కాంగ్రెస్ సీనియర్ నేత అశోక్ గహ్లోత్ అన్నారు. "ఆయనకు ఆ విషయం తెలుసు. అందుకే ఆయన ప్రజలకు ఎలాంటి హామీలు ఇవ్వడం లేదు. ఎన్నికల తర్వాత కొత్త సీఎం ఎవరో తెలుస్తుంది. మ్యానిఫెస్టో విడుదల సమయంలో భాజపా ఆయన్ను అవమానించింది. మహాగఠ్‌బంధన్ ఈసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది" అని వ్యాఖ్యలు చేశారు. బిహర్‌లో ఎన్డీయే కూటమి శుక్రవారం మ్యానిఫెస్టోను విడుదల చేసింది. ఇటీవల ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ కూడా ఇదే తరహా విమర్శలు చేశారు. ప్రస్తుత ఎన్నికల్లో ఎన్డీఏ విజయం సాధించినా నీతీశ్‌ను మళ్లీ సీఎం పదవిని చేపట్టనివ్వరని పేర్కొన్నారు. ఆయనను భాజపాలోని గుజరాత్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు హైజాక్ చేశారంటూ ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై పరోక్షంగా విమర్శలు సంధించారు. బిహార్‌ను నియంత్రిస్తోంది వారిద్దరేనంటూ ఆక్షేపించిన సంగతి తెలిసిందే. నవంబర్ 6, 11 తేదీల్లో బిహార్ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. నీతీశ్ నాయకత్వంలోనే ఎన్నికల వెళ్తామని ప్రధాని మోదీ చెప్పారు. కానీ..ఎన్డీయే గెలిస్తే ఆయనే సీఎం అవుతారా లేదా అనే దానిపై మాత్రం భాజపా నుంచి ఎలాంటి స్పష్టతా లేదు. ఈ తరుణంలో బిహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌధరీను ఉద్దేశించి కేంద్ర మంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో సామ్రాట్‌కు ఓటు వేసి గెలిపించాలని, రానున్న రోజుల్లో ఆయన్ను ప్రధాని మోదీ "బిగ్ మ్యాన్, వెరీ బిగ్ మ్యాన్" చేస్తారని చెప్పారు. నీతీశ్ కుమార్‌ను తప్పించి, భాజపా అభ్యర్థికి సీఎం బాధ్యతలు అప్పగించేందుకు ఎన్డీయే ప్రయత్నాలు చేస్తోందని విపక్షాలు విమర్శలు చేస్తోన్న నేపథ్యంలో అమిత్ షా ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.



## కార్తీక ఏకాదశితో ఆలయాల్లో రద్దీ

**యాదగిరిగుట్ట, నవంబర్ 1 :** కార్తిక మాసం శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ మహా విష్ణువు ఆలయాల వద్ద భక్తుల తాకిడి కనిపించింది. 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అన్న నామస్మరణతో ఆలయ ప్రాంగణ్శా మారుమోగాయి. యాదగిరిగుట్టతో పాటు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వైష్ణవాలయాల్లో రద్దీ నెలకొంది. దీనిని చిలుకు ఏకాదశి కూడా అంటారు. దీంతో హైదరాబాద్ సహా తెలుగు రాష్ట్రాల్లోని అన్న వైష్ణవాలయాల్లో రద్దీ నెలకొంది. యాదాద్రితో పాటు రత్నగిరి, నగరంలోని టిటిడి వెంకటేశ్వరాలయాలు, పాతబస్‌ఈ రంగనాథ ఆలయంలో రద్దీ కనిపించింది. శ్రీకాకుళం జిల్లా, జలుమూరు మండలం, చిన్నదూగం కూడలిలో వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకునేందుకు కోటబొమ్మాళి, జలుమూరు, నరసన్నపేట మండలాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో స్వామిని దర్శించుకునేందుకు బారులు తీరారు. స్వామిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆమదాలవలస మండల ప్రాంతాల్లోనూ విష్ణు, శివ ఆలయాల్లో ఏకాదశి సందర్భంగా శనివారం భక్తులు పోటెత్తారు. కార్తిక ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో సుమారు కిలోమీటర్ పొడవునా బారులు తీరారు. కార్తిక ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించారు.



## మహిళా న్యాయవాదికి సైబర్ ముఠా టోకరా..

### రూ.52 లక్షలు కొల్లగొట్టిన నేరస్థులు

**అమరావతి:** మోసాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర సైబర్ ముఠాను ఏపీ పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల మహిళా న్యాయవాదికి ఈ ముఠా సభ్యులు ఫోన్ చేశారు. అమెరికాలో ఉన్న ఆమె కుమారులు ఆర్థిక నేరాలకు పాల్పడ్డారంటూ డిజిటల్ అరెస్టు పేరుతో బెదిరించారు. ఆమె వద్ద నుంచి రూ. 52 లక్షలు తీసుకున్నారు. ఈ ఘటనపై బాధితురాలు ఏలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మూడు బృందాలు రంగంలోకి దిగాయి. యూపీ, దిల్లీ, మహారాష్ట్రలో 8 మంది ముఠా సభ్యులను అరెస్టు చేశారు. కీలక సూత్రధారులు బంగ్లాదేశ్‌కు పారిపోయారు. ఈ సైబర్ ముఠా దేశంలో రూ. 100 కోట్లకు పైగా స్వాహా చేసినట్లు ప్రాథమిక సమాచారం.

## మహిళ దారుణ హత్య



**నిజామాబాద్ :** నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం మిట్టాపూర్ శివారులో గుర్తుతెలియని మహిళ దారుణ హత్యకు గురైంది. మృతదేహానికి తల లేదు, చేతుల వేళ్లు సగం వరకు తెగి ఉన్నాయి. మహిళ మృతదేహాన్ని బాసర ప్రధాన రహదారి పక్కన స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు సంఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. మహిళ వయసు 30 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతదేహం వివస్త్రగా ఉండటంతో అత్యాచారం చేసి హత్య చేసినట్లు అనుమానిస్తున్నారు. వేరే ప్రాంతంలో చంపి ఇక్కడ పడేశారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని పోలీసు కమిషనర్ సాయి చైతన్య పరిశీలించారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

### మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు అన్నారు. శనివారం మార్కెట్ యార్డులో సింగారెడ్డి పాలెం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోని విక్రయించి మద్దతు ధర పొందాలని తెలిపారు. ఏ గ్రేడ్ ధాన్యానికి మద్దతు ధర 2389 రూపాయలు, కామన్ గ్రేడ్ కి 2369 రూపాయలుగా ప్రభుత్వం నిర్ణయించి కొనుగోళ్లు చేపడుతున్నట్లు వెల్లడించారు. కావున రైతులు ఆరుగాలం కష్టపడి పని చేసి పండించిన పంటను దళారులకు విక్రయించి మోసపోవద్దని కోరారు. సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేయడంతో పాటుగా ఉచిత విద్యుత్, పంటకి గిట్టుబాటు ధర కల్పించడంతో రాష్ట్రంలో వరి పంట దిగుబడి పెరిగిందని చెప్పారు. అన్నదాతను ఆదుకోవడం కోసం రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ, సమాచార శాఖ, మంత్రి పొంగులేటి చొరవతో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరిగిందని, తద్వారా వేగవంతంగా ధాన్యం కొనుగోళ్లు జరుగుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ వెంకటేశ్వర్లు, వ్యవసాయాధికారిణి రాధా, ఏఈఓ అరవింద్, మార్కెట్ కార్యదర్శి పంతులు, కాంగ్రెస్ నాయకులు నేల్లూరి భద్రయ్య, మాజీ ఎంపీటీసీ బొడ్డు బొందయ్య, గుండా బ్రహ్మం, వెంకన్న, భాస్కరరావు, డీసీఎంఎస్ సిబ్బంది నవీన్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



# మృతుని కుటుంబానికి భవన నిర్మాణ యూనియన్ ఆర్థిక సాయం

**వాజేడు, రాజముద్ర న్యూస్ :** మండల కేంద్రంలో పేరూరు గ్రామానికి చెందిన బొల్లె భీమేశ్, కస్తూరి దంపతుల పెద్ద కుమారుడు జశ్వంత్(13) పేరూరు ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. శనివారం మధ్యాహ్నం స్నేహితులతో కలిసి ఈతకోసం రాంపురం పరిధిలో ఉన్న బోయిరాల మడుగు వాగు వద్దకు వెళ్లారు. ఈత రాకపోవటంతో కాలుజారి ప్రమాదశాత్తు నీటిలో మునిగి చనిపోయారు. మృతుని కుటుంబాన్ని వాజేడు మండల భవన నిర్మాణ కార్మిక అధ్యక్షులు కాటా రామచంద్రయ్య, పరామర్శించి 7400 రూపాయలు ఆర్థిక సాయంతో పాటు, 25 కేజీల బియ్యం నూనె డబ్బా అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు గొట నాగేశ్వరావు, కులారాపు సతీష్, మునిగొండ మల్లికార్జున్, పెల్లకూరి సాయి, పేట నర్సయ్య, బోట మునేష్, అడ్డురి రమేష్, రాజు, కాటా మహేష్, రమేష్, లక్ష్మన్, ఎర్రబాబు, తొర్రెమ్ యేసు తదితరులు పాల్గొన్నారు.



# పిండిప్రోలు జూనియర్ కళాశాల నూతన ప్రధానాచార్యులుగా ఉపేందర్

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** తిరుమలాయపాలెం మండలంలోని పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రధానాచార్యులుగా గుంపెనపల్లి ఉపేందర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ప్రధానాచార్యులుగా పనిచేసిన ఎస్. శ్రీనివాసరావు ఇటీవల పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో ప్రధానాచార్యులుగా పూర్తి అధనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం ఆయనకి పుష్పగుచ్చం అందజేసి ఘన స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధ్యాపకులు, సహెూద్యోగులను సమన్వయం చేసుకుంటూ కళాశాల ఉన్నతికి, అత్యుత్తమ ఫలితాలను సాధించి, విద్యార్థులకి బంగారు భవిష్యత్ నిర్మించేందుకు శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో ప్రధానాచార్యులుగా బాధ్యతలు అప్పగించిన జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కే. రవిబాబు కి ఉపేందర్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మురళీకృష్ణ, శ్రీధర్ కుమార్, ప్రవీణ్, చైతన్య, నరసింహారావు, జయశ్రీ, లలిత, వెంకటేశ్వర్లు, సతీష్, విజయలక్ష్మి, రామ్మూర్తి, ఉపేంద్ర, వీరస్వామి, చంద్రమౌళి, నారాయణ, శ్రీనివాస్, ఉపేంద్ర చారి, శ్రీలత, పరశురామ్, అధ్యాపకేతరులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల నడ్డి విరిచిన మొంథా తుఫాన్

### ఎకరాకు 50 వేల పరిహారం చెల్లించాలని

### : ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**మిర్యాలగూడ :** మొంథా తుఫాన్ కారణంగా రైతుల నడ్డి విరిగిపోయిందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. చేతికొచ్చే దశలో ఉన్న పంటలు నేలమట్టమై, రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. శనివారం మిర్యాలగూడలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉమ్మడి జిల్లాలలో తుఫాన్ భారీ నష్టం మిగిల్చిందని తెలిపారు. వ్యవసాయానికి రైతులు పెట్టిన పెట్టుబడులు పూర్తిగా నష్టపోయిన నేపథ్యంలో, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి ఎకరాకు రూ.50 వేల పరిహారం చెల్లించాలన్నారు. ప్రభుత్వం ఎకరాకు రూ.10 వేల పరిహారం ఇవ్వడం తగదని ఆయన విమర్శించారు. క్షేత్రస్థాయిలో అధికారులు పంటనష్టాన్ని పరిశీలించి వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తేమశాతం తక్కువగా ఉందని పత్తికి ధర తగ్గించడం సరికాదని పేర్కొంటూ, క్వింటాకు కనీసం రూ.70 వేల చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అలాగే తుఫాన్ కారణంగా ఇండ్లు కూలిపోయిన వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని కోరారు.

# నవీన్ యాదవ్ గెలుపుకై మంత్రి పొంగులేటి పాదయాత్ర

### ప్రచారంలో పాల్గొన్న చెన్ను వెంకటరమణ



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధిలో అగ్రగామిగా నిలవాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ను భారీ మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత ప్రజలపై తప్పక ఉందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రెహమత్ నగర్ డివిజన్ ఇంచార్జిగా ఉన్న ఆయన శనివారం మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత పిజేఆర్ తల్లితండ్రుల పేరు కలిగిన శివమ్మ, పాపిరెడ్డి హిల్స్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా పాదయాత్ర నిర్వహించి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల పాటు తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకుతిన్న బిఆర్ఎస్ నాయకులకు జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో ఓటు అడిగే హక్కులేదని తెలిపారు. గతంలో పిజేఆర్ ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసిన తర్వాత ఇంతవరకు మళ్లీ అటువంటి అభివృద్ధే జరుగలేదన్నారు. ధనిక తెలంగాణాను అప్పుల్లో ముంచిన గత పాలకులు పేదలకు ఇండ్లు కట్టిస్తే కమీషన్లు రావని కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను చేపట్టారని ఆరోపించారు. పదేళ్లలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయలేని బి ఆర్ ఎస్ నేతలు ఇప్పుడు కేవలం 20 నెలల్లో కాంగ్రెస్ ఏమీ చేయలేదంటూ సరిపోల్చుతున్నారని వారి అజ్ఞానానికి ఇంతకంటే నిదర్శనం ఏముంటుందని అన్నారు. ఎన్నికల తర్వాత తాను ప్రత్యేకంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి వచ్చి పేదలకు ఇండ్లపట్టాలు, ఇండ్లు మంజూరు చేస్తామని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మరో రెండు విడతల్లో పేదలకు ఇండ్లు మంజూరు చేస్తూ ఇండ్ల నిర్మాణానికి రూ. 5 లక్షల చొప్పున అందజేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ యువజన కాంగ్రెస్ నాయకులు చెన్ను వెంకటరమణ, మేకల మల్లిబాబు యాదవ్, పల్లెబోయిన శ్రీనివాస్, పార్టీ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

# నూతన విద్యుత్తు లైన్ ఏర్పాటు సర్వే



**వాజేడు, రాజముద్ర న్యూస్ :** ములుగు మండల పరిధిలోని చెరుకూరు, చింతూరు, పేరూరు, ధర్మవరం, అయ్యవారిపేట, పంచాయతీలో నూతనంగా విద్యుత్తు లైన్ లు ఏర్పాటు చేయటం కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ నేతృత్వంలో విద్యుత్ శాఖ ఏఈ హర్షత్ హౌమద్ సమక్షంలో శనివారం సర్వే నిర్వహించారు. ఏక్కడైయితే ప్రజలు విద్యుత్ సమస్యతో బాధపడుతున్నారో వారికి విద్యుత్తులై ఏర్పాటు చేయడం కోసం భద్రాచలం నియోజకవర్గం ఎమ్మెల్యే తెల్ల వెంకట్రావ్ నిధుల నుండి మంజూరు చేయడం జరుగుతుందని విక్రాంత్ తెలిపారు. ఈ ఐదు గ్రామ పంచాయతీలలో సర్వే నిర్వహించి విద్యుత్ సమస్య పరిష్కారం కోసం ఆయన కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎస్కే కాజావలి, నల్లగాసి రమేష్ యాదవ్, కురసం కృష్ణమూర్తి, కోరం పగిడయ్య, గొబ్బూరి రఘుపతి, తుమ్మ ఎర్రబాబు, తదితరులు పాల్గొన్నారు

# దారూర్ జాతరకు వచ్చే భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి

### వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** దారుర్ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ అధికారులకు సూచించారు. శనివారం ధారూర్ జాతరకు సంబంధించి ఏర్పాట్లపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో జిల్లా అదనపు కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ... దారూర్ జాతర నవంబర్ 11 నుండి 16 వరకు జరుగుతుందన్నారు. జాతరకు లక్షల సంఖ్యలో భక్తులు రావడం జరుగుతుందని దానికి అనుగుణంగా సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆయన తెలిపారు. 24 గంటలు సంబంధిత శాఖలు అధికారులు విధుల్లో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. అధికారులు సమన్వయంతో పని చేస్తూ జాతర సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. త్రాగు నీటి, విద్యుత్తు, సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయాలని వైద్య శాఖ అధికారులకు సూచించారు. జాతరకు చాలా మంది ముఖ్యులు వచ్చే అవకాశం ఉన్నందున పోలీస్ బందోబస్తుకు సిబ్బందిని సమకూర్చాలని అధికారులకు సూచించారు. జాతరలో సంబంధిత సౌకర్యాలను సూచించే విధంగా బోర్డు లను ఏర్పాటు చేయాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో డిఎండబ్ల్యూఓ రాజేశ్వరి, జిల్లా పశుసంవర్ధక అధికారి సదానందం, పంచాయతీరాజ్ ఉమేష్, ఎంపీడీఓ నరసింహులు, జాతర నిర్వాహక కార్యవర్గ సభ్యులు సంజయ్ కుమార్, డి.రాజు, కె.మార్క్, ఎం.శైలాస్, పోలీస్, అబ్కారీ, ఆరోగ్య, అగ్నిమాపక, రవాణా శాఖల అధికారులు పాల్గొన్నారు.





# ఫోరెన్సిక్ సైన్స్‌పై న్యాయవాదులకు అవగాహన తప్పనిసరి

### జిల్లా న్యాయమూర్తి పి.వసంత్

**కొత్తగూడెం :** కోర్టు కేసులలో ఫోరెన్సిక్ సాక్ష్యం అనేది కీలకపాత్ర పోషిస్తుందని, న్యాయవాదులు దాని పై పక్కా అవగాహన కలిగి ఉండాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా న్యాయమూర్తి పి. వసంత్ తెలిపారు. శనివారం జిల్లా న్యాయవాదుల లైబ్రరీ హాల్‌లో ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఐ.ఎల్.పీ.ఏ) ఆధ్వర్యంలో "కోర్టు కేసులలో ఫోరెన్సిక్ సాక్ష్యం ప్రాముఖ్యత" అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన వక్తగా పాల్గొన్న ప్రో-బ్లాక్ డైరెక్టర్ మోహన్ ఎర్రగోళ్ల మాట్లాడుతూ భారత సాక్ష్య చట్టంలో ఫోరెన్సి క్ పరిశోధనల అవసరం మరింత పెరిగిందని తెలిపారు. న్యాయవాదులు ఈరంగంలో నేర్చుకో వాల్సిన నైపుణ్యాలను ప్రస్తావిస్తూ పాలిగ్రఫీ టెస్ట్, ఫింగర్ ప్రింట్ అనాలసిస్, నార్కో అనాలి సిస్, హ్యాండ్ రైటింగ్ అనాలసిస్, సంతకం ధృవీకరణ వంటి అంశాల్లో పూర్తి సవివరమైన అవగాహన కల్పించారు. ఈ సదస్సుకు విశిష్ట అతిథులుగా అదనపు జిల్లా జడ్జి ఎస్.సరిత, న్యాయమూర్తులు ఎం. రాజేందర్, కె.కిరణ్‌కు మార్, కె.కవిత, కె.సాయిశ్రీ, స్పెషల్ జ్యుడిషియ ల్ సెంకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ మెండు రాజమల్లు తదితరులు హాజరయ్యారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఐ.ఎల్.పీ.ఏ జిల్లా కన్వీనర్లు జే.గోపికృష్ణ, సుంకర భానుప్రి య, సీనియర్ న్యాయవాదులు పోసాని రాధాకృష్ణమూర్తి, జే.శివ రామ్ ప్రసాద్, విజయ్ భాస్కర్ రెడ్డి, పి.నాగేశ్వర రావు, గంట వీరభద్రం, కిలారు పురుషో త్తం, గాజుల రామమూర్తి, బి.చిరంజీవి, నల్లమల ప్రతిభ, లక్ష్మీ సరిత, కాసాని రమేశ్, సహానజు పర్వీన్ పాల్గొన్నారు. అదేవిధంగా అడపాల మహాలక్ష్మి, యెర్రా కామేష్, సాధిక్ పాషా, ఎర్రపాటి కృష్ణ, మారపాక రమేష్, అంబటి రమేష్, దొడ్డా సామం త్, మేకల దేవేందర్, పాల రాజశేఖర్, పగిడిపల్లి శ్రీకాంత్, వడ్లకొండ హరిప్రసాద్, ఇందిరా ప్రియదర్శిని, బేబీ షామిలి, దారావత్ రాధాకృష్ణ, యాస యుగేందర్ న్యాయవాదులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేసారు.



# కురుమూర్తి జాతరకి తెలంగాణ సభాపతికి ఆహ్వానించిన దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** తెలంగాణ రాష్ట్రంలో అతి పురాతన ఆలయం పేదల తిరుపతిగా ప్రసిద్ధి చెంది దేవరకద్ర నియోజకవర్గం లో కొలువైనా కురుమూర్తి స్వామి జాతర ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రత్యేకం. స్వామి వారి అలంకరణ, ఉద్దాలు ప్రఖ్యాతి గాంచిన ఈ జాతరకు రావాలని సభాపతి నీ కలిసి ఆహ్వానించారు దేవరకద్ర నియోజకవర్గం శాసనసభ్యులు జి.మధుసూదన్ రెడ్డి. ఈ సందర్భంగా జీఎంఆర్ మాట్లాడుతూ.. గత ఏడాది తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కోసం 110 కోట్లతో శంకుస్థాపన చేయగా, ఈ ఏడాది ప్రత్యేక అతిథిగా తెలంగాణ రాష్ట్ర సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ రానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకులు అనిల్ కుమార్ యాదవ్, సామెల్ కార్తీక్ పాల్గొన్నారు.



# నేడే ఎన్కతలలో రుద్ర మైసమ్మ జాతర

### హాజరుకానున్న బజరంగ్దళ్ రాష్ట్ర అధ్యక్షులు శివరామకృష్ణ



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ జిల్లా మోమిన్ పెట్ మండల పరిధిలోని ఎన్కతల గ్రామంలో ఇండస్ట్రియల్ పార్కు కోసము ప్రభుత్వము రైతుల భూములను స్వాధీనం చేసుకుని అక్కడ రోడ్లు వేసే కార్యక్రమాన్ని చేపట్టిందని గ్రామస్తులు, బజరంగ్ దళ్ రాష్ట్ర అధ్యక్షులు శివరామకృష్ణ అన్నారు. సందర్భంగా శివరామకృష్ణ మాట్లాడుతూ రుద్ర మైసమ్మ ప్రాంతంలోని మాదిగోని గుట్టగా ప్రసిద్ధి చెందిన గుట్ట పైన ఉన్న రుద్ర మైసమ్మ జాతర అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. మూడు వందల సంవత్సరాల నుండి రైతులందరూ పంటలు వేసే ముందు పంట పండిన తర్వాత అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటూ అమ్మవారి అనుగ్రహం పైన భక్తి విశ్వాసాలని కలిగి ఆలయంలో పూజలు చేస్తూ వస్తున్నారని పేర్కొన్నారు. ఇండస్ట్రియల్ కార్పొరేషన్ అధికారులు నూతనంగా ఏర్పాటు చేస్తున్న రోడ్డు నిర్మాణం సంబంధించిన పక్కకు వేసే అవకాశం ఉన్నా కూడా ఇలా చేయడం శోచనీయమని, హిందువులను టార్గెట్ చేసి ఆలయ ఆనవాలు లేకుండా చేస్తున్న పనిగా అర్థమవుతుందని పేర్కొన్నారు. ఇండస్ట్రియల్ పార్కుకు భూమిని స్వాధీనం చేసేటప్పుడు రైతులందరూ అడ్డుపడి తమకు ఆలయానికి 11 ఎకరాల భూమిని కేటాయించాలని ఎన్కతలగ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నేడు జరగబోయే జాతరలో భక్తులందరూ పెద్ద ఎత్తున పాల్గొని జాతరను విజయవంతం చేయాలని శివరామకృష్ణ తెలిపారు.

# సంగీతం నృత్య పోటీలకు ప్రభుత్వ ఉద్యోగులకు ఆహ్వానం

### • తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి



**రంగారెడ్డి :** కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అఖిల భారత సివిల్ సర్వీసెస్, సంగీత నృత్య పోటీలకు తెలం గాణ ప్రభుత్వం ఉద్యోగులను ఆహ్వానిస్తున్న ట్లు తెలంగాణ రాష్ట్ర భాషా ససాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నరసిం హారెడ్డి ఓ పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. 2025- 26 సంవత్సరాలకు గాను రాష్ట్ర ప్రభుత్వం తరపున డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయం ఆధ్వర్యంలో జరిగే పోటీలలో పాల్గొనడానికి సంగీతం నృత్యం కింద పేర్కొన్న అంశాలలో నైపుణ్యం ఉన్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల నుండి దరఖాస్తులను వాట్సాప్ ద్వారా కోరుతున్నామని డాక్టర్ నరసింహారెడ్డి తెలిపారు. నవంబర్ 6 7 తేదీలలో రవీంద్రభారతిలో పోటీలు నిర్వహించి ఎంపిక చేయబడతాయని పేర్కొన్నారు.

**అంశాలు: హిందుస్తానీ గాత్ర సంగీతం :** కర్ణాటక గాత్ర సంగీతం పాశ్చాత్య గాత్ర సంగీతం, జానపద గీతాలు, సోలో బృంద గానం వివిధ వాయిద్యాలు సంగీతం మీద రూతుల్లో నృత్యం జానపద బృంద నృత్యం లఘునాటిక వివిధ విభాగాల్లో పాల్గొనే పోటీదారులు ఆయా దరఖాస్తు విభాగాలను వారిగా క్రింద సూచించిన వారికి వాట్సాప్ ద్వారా అక్టోబర్ 29 నుండి నవంబర్ ఒకటో తేదీ లోగా సమర్పించవలసిందిగా కోరారు. సంగీతం ఎన్ సుధీర్ కుమార్ 9849641839, నృత్యం నీరజాక్షి 9704466499 వాయిద్యాలు ఆయేషా9948611766, లఘు నాటికలు బి శ్రీశైలం 9959667703

### ఎంపిక తుది నిర్ణయం న్యాయ నిర్ణీతలదే

వాట్సాప్ లో దరఖాస్తు వివరాలు పేరు హెూదా వయస్సు శాఖ కార్యాలయం పాల్గొనే అంశం నిర్నిత సమయం వివరాలు పొందుపరచాలి. ఏమైనా సందేహాలు ఉంటే పూర్తి వివరాలకు యామిని కనకధారా జాయింట్ సెక్రటరీ (కల్చరల్ ) డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయ సంఘం మొబైల్ నెంబర్ 8309395375, ఎన్ సుధీర్ కుమార్ 9849641839,9849641839 లలో సంప్రదించవచ్చునని రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి పేర్కొన్నారు.

# దారిద్ర్యరహిత రాష్ట్రంగా కేరళ

- అత్యంత దుర్భర పేదరిక నిర్మూలన
- వివిధ కార్యాక్రమాల ద్వారా దీనిని సాధించాం
- కేరళ అవరణ దినోత్సవం సందర్భంగా సిఎం ప్రకటన
- అసెంబ్లీలో విజయన్ ప్రకటన.. నిరసనగా విపక్షం వాకౌట్



**తిరువనంతపురం, నవంబర్ 1 :** దారిద్ర్య రహిత రాష్ట్రంగా కేరళ అవతరించినట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ అసెంబ్లీలో ప్రకటించారు. దేశంలో అత్యంత దుర్భర పేదరికాన్ని నిర్మూలించిన తొలి రాష్ట్రంగా గుర్తింపు పొందిందన్నారు. కేరళ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సీఎం ఈ విషయాన్ని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు 21,263 మందికి మొదటిసారిగా రేషన్ కార్డులు, ఆధార్, పెన్షన్లు వంటి ముఖ్యమైన పత్రాలు మంజూరు చేసిందని తెలిపారు. 4,394 కుటుంబాలకు జీవనోపాధి ప్రాజెక్టుల ద్వారా పని కల్పించామన్నారు. ప్రజలందరికీ సమాన హక్కులు నివాసం, విద్య, వైద్యం అందుతున్నట్లు తెలిపారు. దీనివల్ల రాష్ట్రం అత్యంత దుర్భర పేదరికం నుంచి బయట పడిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కాగా కాంగ్రెస్ నేతృత్వం లోని ప్రతిపక్షాలు పినరయి విజయన్ ప్రకటనను తప్పుబట్టాయి. ప్రభుత్వం తప్పుడు ప్రకటనలతో ప్రజలను మోసం చేస్తోందని విమర్శించాయి. ప్రతిపక్ష నేత సతీశన్ అసెంబ్లీలో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చేసిన ప్రకటన భారీ మోసం అని విమర్శించారు. ప్రభుత్వ ప్రకటనను వ్యతిరేకిస్తూ ప్రతిపక్ష నేతలు సభ నుంచి వాకౌట్ చేశారు. నవంబర్ 1న కేరళ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా శనివారం శాసనసభలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ ఓ చారిత్రాత్మక ప్రకటన చేశారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 300 నిబంధన కింద కేరళను తీవ్ర పేదరిక రహిత రాష్ట్రంగా ఆయన అసెంబ్లీలో ప్రకటించారు. ఈ సందర్భంగా విజయన్ అసెంబ్లీలో మాట్లాడుతూ.. 'ఒక శతాబ్దం క్రితం జరిగిన జాతీయోద్యమం నుంచి పుట్టుకొచ్చిన ఆలోచన నుండే భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయి. అయితే స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో.. దానిని సాధించడానికి దీర్ఘమైన, తీవ్రమైన పోరాటాలు జరిగాయి. ఆ పోరాటాల ఫలితమే ఐక్య కేరళ ఏర్పడింది. మలయాళీల కల సాకారమైంది. ఐక్య కేరళ ఆవిర్భవించి నేటికి 69 సంవత్సరాలు. కానీ ఈ సంవత్సరం కేరళ అవతరణ దినోత్సవం కేరళ ప్రజలకు, ఒక నవ యుగానికి ప్రారంభంలాంటిది. కేరళను భారతదేశంలోనే మొట్టమొదటి తీవ్ర పేదరికం లేని రాష్ట్రంగా మార్చడంలో మనం విజయం సాధించాము. ఈరోజు జరుపుకునే అవతరణోత్సవం ఓ చారిత్రాత్మకం. చరిత్రలో ఒక స్థానాన్ని ఏర్పర్చుకుందని అన్నారు. శాసనసభ అనేక చారిత్రాత్మక చట్టాలు, విధాన ప్రకటనలకు సాక్ష్యంగా నిలిచింది. నవ కేరళ సృష్టిలో మరో మైలురాయిని గుర్తించే సమయంలో అసెంబ్లీ ఇప్పుడు సమావేశమైంది. 2021లో కొత్త మంత్రిత్వశాఖ ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తొలి మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాల్లో తీవ్ర పేదరికన నిర్మూలన ఒకటి. శాసనసభ ఎన్నికల సమయంలో.. ప్రజలకు ఇచ్చిన అతి ముఖ్యమైన వాగ్దానాలలో ఒకదాన్ని నెరవేర్చడానికి ఇది నాంది కూడా. స్థానిక స్వపరిపాలన శాఖ నాయకత్వంలో, కేరళ ఇన్స్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్ సమన్వయంతో కేవలం రెండు నెలల్లో తీవ్ర పేదరికంలో నివశిస్తున్న కుటుంబాలను గుర్తించే పక్రియను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ ప్రయత్నంలో ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రతినిధులు, కుటుంబశ్రీ కార్మికులు, స్వచ్ఛంద సేవకులు, అధికారులు సహా ఇతరులు కూడా భాగస్వాములయ్యారు. ఈ పక్రియలో ప్రజాభాగస్వామ్యం కనిపించిం ది. మొదటగా వడక్కంచెరి మునిసిపాలిటి, అంచుతెంగు, తిరునెల్లి గ్రామ పంచయతీలలో దీన్ని పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించాం. ఆ తరువాత రాష్ట్రం మొత్తానికి విస్తరించాం. సమాజంలో అన్ని వర్గాల నుండి తీసుకున్న సమిష్టి అభిప్రాయాలు, సూచనల ద్వారా లబ్దిదారుల కుటుంబాలను గుర్తించి చారిత్రాత్మక ప్రాజెక్టును ప్రారంభించాం అని విజయన్ అసెంబ్లీలో అన్నారు. అయితే తీవ్ర పేదరిక రహిత రాష్ట్రంగా కేరళను సిఎం ప్రకటించడంపై ప్రతిపక్షాలు విమర్శించాయి. ఆ రాష్ట్రంలోని కాంగ్రెస్ నేతలు ఇది మోసం అని మండిపడ్డారు. ప్రతిపక్ష సభ్యుల ఆరోపణలపై సిఎం విజయన్ స్పందించారు. ప్రతిపక్షనేత వ్యాఖ్యలు అప్రస్తుతమని విజయన్ తోసిపుచ్చారు. దీనిపై ప్రతిపక్షాలు ఎందుకు భయపడుతున్నాయో అర్థంకావడం లేదని అన్నారు. ఇది ఒక చారిత్రాత్మకమైన ప్రకటన. ప్రపంచానికి తెలియజేయడానికి అసెంబ్లీలో ప్రకటించాం. ప్రతిపక్షనేత వి.డి సతీశన్ దానిని మోసం అనే అంటారు. ఎందుకంటే అది అతనికి అలవాటు అని సిఎం అన్నారు. ఈ సందర్భంగా ఈ ప్రభుత్వం తాను నెరవేర్చగల వాగ్దానా లను మాత్రమే చేస్తుంది. చేసిన వాగ్దానాన్ని నెరవేరుస్తుంది. ఇప్పుడు ఇప్పటికే సాధించిన వాటిని నిలబెట్టుకోవడానికి చర్యలు తీసుకుం టాము అని విజయన్ పేర్కొన్నారు. ఈరాష్ట్ర అవతరణ దినోత్సవం నాడు.. చారిత్రాత్మక ప్రకటన చేసిన రోజున.. నేడు ప్రతిపక్షాలు అసెంబ్లీని బహిష్కరించడాన్ని పార్లమెంటు వ్యవహారాల మంత్రి ఎం.బి రాజేష్ విమర్శించారు. ఇది చరిత్రలో నిలిచిపోతుంది. చరిత్ర ప్రతిపక్షాన్ని దోషులుగా ప్రకటిస్తుంది అని అన్నారు.



## శ్రీ సత్యసాయి సంజీవని ఆస్పత్రిని సందర్శించిన ప్రధాని మోదీ

**ఛత్తీస్‌గఢ్:** రాయ్‌పుర్‌లోని శ్రీ సత్యసాయి సంజీవని ఆస్పత్రిని ప్రధాని నరేంద్ర మోదీ సందర్శించారు. గుండె సంబంధిత శస్త్రచికిత్సలు చేయించుకున్న చిన్నారులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆస్పత్రికి చేరుకున్న మోదీకి.. 'వన్ వరల్డ్ వన్ ఫ్యామిలీ మిషన్' వ్యవస్థాపకులు మధుసూదన్ సాయి స్వాగతం పలికారు. సత్యసాయి సంజీవని ఆస్పత్రుల ఛైర్మన్ శ్రీనివాసన్ ప్రధానికి చిత్రపటాన్ని అందజేశారు. సత్యసాయి బాబా విగ్రహానికి పూజలు నిర్వహించిన అనంతరం.. ఆ ఆస్పత్రిలో చికిత్స పొందిన చిన్నారులకు ప్రధాని ధ్రువ పత్రాలు అందజేశారు. చిన్నారుల ప్రశ్నలకు ఓపిగ్గా సమాధామిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ క్రికెటర్, సత్యసాయి సంజీవని ఆస్పత్రి ట్రస్టీల్లో ఒకరైన సునీల్ గవాస్కర్ కూడా పాల్గొన్నారు. వన్ వరల్డ్ వన్ ఫ్యామిలీ మిషన్‌లో భాగంగానే 'శ్రీ సత్యసాయి సంజీవని' ఆస్పత్రులను నిర్వహిస్తున్నారు. ఈ మిషన్ వైద్యం, విద్య, పోషకాహార రంగాల్లో వందకు పైగా దేశాల్లో సేవలందిస్తోంది. భారత్‌లోని 25 రాష్ట్రాల్లో 4 కేంద్ర పాలిత ప్రాంతాల్లో రోజూ కోటి మంది ప్రభుత్వ పాఠశాలల చిన్నారులకు పోషకాహారాన్ని అందిస్తోంది. అంతేకాకుండా దేశంలోనే మొట్ట మొదటి ఉచిత ప్రైవేటు వైద్య కళాశాలను కూడా నిర్వహిస్తోంది. ఈ మెడికల్ కాలేజీని ప్రధాని నరేంద్ర మోదీ 2023లో ప్రారంభించారు. ఉచిత వైద్య కళాశాలతో పాటు శ్రీ సత్యసాయి యూనివర్సిటీ ఫర్ హ్యూమన్ ఎక్సలెన్స్ పేరిట ఓ విశ్వవిద్యాలయం కూడా ఉంది. అంతేకాకుండా కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లో 6వ తరగతి నుంచి పీహెచ్‌డీ వరకు విద్యార్థులకు పూర్తిగా ఉచితంగా విద్యను అందిస్తున్నారు. దేశంలోని చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని తగ్గించడమే లక్ష్యంగా అన్నపూర్ణ ట్రస్ట్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల చిన్నారులకు పోషకారాన్ని అందిస్తున్నారు.



## షట్‌డౌన్ ఎఫెక్ట్..

### అమెరికా సంపదలో రూ.62వేలకోట్లు ఆవిరి..

**యూఎస్ :** కీలకమైన బిల్లుల విషయంలో అధికార, విపక్ష చట్టసభ సభ్యుల మధ్య సయోధ్య కుదరకపోవడంతో అమెరికా ప్రభుత్వం షట్‌డౌన్‌ను ఎదుర్కొంటోంది. 31 రోజులుగా అగ్రదేశ ఆర్థిక వ్యవస్థ మూసివేత కొనసాగుతోంది. దానివల్ల అమెరికా సంపదలో 7 బిలియన్ డాలర్లు (రూ.62,149 కోట్లకు పైగా) ఆవిరయింది. ఈ మేరకు కాంగ్రెషనల్ బడ్జెట్ ఆఫీస్ అంచనా వేసింది. "ఈ షట్‌డౌన్ వల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థ నుంచి 7 బిలియన్ డాలర్ల సంపద శాశ్వతంగా ఆవిరైంది. ఇది ఇంకా కొనసాగితే.. ఆరు వారాలకు 11 బిలియన్ డాలర్లు, ఎనిమిది వారాలకు 14 బిలియన్ డాలర్ల మేర ఆర్థికనష్టం ఏర్పడుతుంది" అని బడ్జెట్ ఆఫీస్ అంచనాలు విడుదల చేసింది. ఈ షట్‌డౌన్ ఎఫెక్ట్ చిన్నగా మొదలై ఆర్థికవ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపనుందని కేపీఎంజీ సంస్థలోని చీఫ్ ఎకానమిస్ట్ డయాన్ స్వాంక్ ఆందోళన వ్యక్తంచేశారు. "ఆర్థికవ్యవస్థ బలహీనంగా ఉంది. ఈ షట్‌డౌన్ వంటివి ఊహించిన దానికంటే పెద్ద సమస్యగా పరిణమించొచ్చు" అని మూడీస్ అనలిటిక్స్‌కు చెందిన మార్క్ జాండీ హెచ్చరించారు. 1981 నుంచి అమెరికా ప్రభుత్వం 15 సార్లు మూతపడింది. అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో.. 2018-19 మధ్య దాదాపు 35 రోజుల పాటు ప్రభుత్వం మూత పడింది. దేశ చరిత్రలోనే అది సుదీర్ఘమైన షట్‌డౌన్‌గా నిలిచింది. ప్రస్తుతం చట్టసభ సభ్యుల్లో రాజీ సూచనలు కనిపించకపోవడంతో.. గత రికార్డును దాటి ఈ షట్‌డౌన్ మరింతకాలం కొనసాగుతుందా..? అనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే బలహీనంగా ఉన్న జాబ్ మార్కెట్‌పై ఈ ప్రభావం కనిపిస్తోందని ఆర్థిక నిపుణులు వెల్లడించారు. ఆర్థిక, విధానపరమైన అనిశ్చితి కారణంగా పలు సంస్థలు పెట్టుబడుల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నాయి. మరికొన్ని కృత్రిమమేధ, ఆటోమేషన్‌ను పరీక్షిస్తున్నాయి. ఇవన్నీ ఉద్యోగాలకు కోత పెడుతున్నాయని పేర్కొంటున్నారు. ఈ మూసివేత వల్ల వెంటనే ఆర్థిక ప్రభావం పడకపోయినా.. దీర్ఘకాలంగా కొనసాగితే మాత్రం ఆర్థిక వృద్ధి మందగిస్తుంది. మార్కెట్లకు అంతరాయం కలిగిస్తుంది. ఇవన్నీ ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయని, ప్రతివారం ఆర్థిక వృద్ధిలో 0.1 నుంచి 0.2 పాయింట్లు తగ్గొచ్చని విశ్లేషకులు అంచనా వేశారు.

## ఆపరేషన్ సిందూర్ 2.0 కు సిద్ధం

### పాక్ ప్రేలాపనలపై ఆర్మీ చీఫ్ జనరల్ ద్వివేది

**భోపాల్, నవంబర్ 1 :** అఫ్ఘానిస్థాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్‌పై నోరు పారేసుకుంటున్న పాక్‌కు భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదీ మరోమారు గట్టి వార్నింగ్ ఇచ్చారు. పాక్ మళ్లీ ఏదైనా మూర్ఖపు చర్యకు దిగితే ఆపరేషన్ సిందూర్ రెండో రౌండ్‌కు తాము రెడీగా ఉన్నామని అన్నారు. ఆపరేషన్ సింధూర్ 2.0కు భారత సాయుధ దళాలు సిద్ధంగా ఉన్నాయి. త్రివిధ దళాధిపతులు సాయుధ దళాలను ముందుండి నడిపిస్తే మమల్ని ఎవరూ ఎదుర్కోలేరని ఆయన అన్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం రేవా జిల్లాలోని సైనిక్ స్కూల్‌ను సందర్శించిన సందర్భంగా ఆయన ఈ హెచ్చరిక చేశారు. ఆపరేషన్ సిందూర్ ముగింపు ఎప్పుడో భారత్ తప్ప ఇతరులెవరూ నిర్ణయించలేరని కూడా తేల్చి చెప్పారు. పాక్ తగిన గుణపాఠం నేర్చుకుందని తాము భావించినప్పుడే ఆపరేషన్ సిందూర్ ముగుస్తుందని అన్నారు. సైన్యానికి నేతృత్వం వహిస్తున్న లెఫ్టినెంట్ జనరల్ ఉపేంద్ర ద్వివేదీ, నావికాదళాధిపతి అడ్మిరల్ దినేశ్ త్రిపాఠీ ఇద్దరూ 1970ల్లో కలిసి చదువుకున్నారు. అప్పట్లో రేవా సైనిక్ స్కూల్లో క్లాస్ 5ఏ తరగతిలో క్లాస్ మేట్స్‌గా ఉన్నారు. ఆ తరువాత ఇద్దరు అంచెలంచెలుగా ఎదుగుతూ సాయుధ దళాల అధిపతులయ్యారు. భారత్‌తో యుద్ధం జరిగే అవకాశం ఉందని ఇటీవల పాక్ రక్షణ శాఖ మంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఈసారి యుద్ధంలో తాము గతంలో కంటే మెరుగైన ఫలితాలు సాధిస్తామని కూడా అన్నారు. ఈ నేపథ్యంలో భారత ఆర్మీ ఛీప్ వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన దాడికి ప్రతీకారంలో భారత్ మే 6,7 తేదీల్లో ఆపరేషన్ సిందూర్ పేరిట దాడులు చేసి పాక్ పాలక వర్గానికి, అక్కడి ఉగ్రమూకలకు వెన్నులో వణుకు పుట్టించింది.

## పాక్‌ది కపటనీతి..

### మానవ హక్కుల ఉల్లంఘనలు ఆపండి

### దౌత్యవేత్త భవిక మంగళానందన్ భారత్



**న్యూఢిల్లీ :** అంతర్జాతీయ వేదికగా పాకిస్థాన్‌కు మరోసారి భంగ పాటు ఎదురైంది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ప్రజల బహిరంగ తిరుగుబాటును అక్కడి దళాలు అణచివేస్తున్నాయని, అక్కడ జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనను వెంటనే ఆపాలని భారత్ డిమాండ్ చేసింది. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ లో చర్చ సందర్భంగా మన దౌత్యవేత్త భవిక మంగళానందన్ మాట్లాడుతూ.. పాక్‌పై తీవ్రస్థాయిలో ధ్వజ మెత్తారు. పీవోకేలో తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనలు కొనసాగుతున్నాయ న్నారు. వీటిని వెంటనే ఆపాలని ఆమె డిమాండ్ చేశారు. 'ఆ ప్రాంతంలోని ప్రజలు ప్రాథమిక హక్కు, స్వేచ్ఛ కోసం చేస్తున్న తిరుగుబాటును ఆ దేశ దళాలు అణచివేస్తున్నాయి. ఈ క్రమం లో అనేకమంది అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోతున్నా రు' అని ఆమె పేర్కొన్నారు. ఐరాసలో జరిగే చర్చల్లో భారత్‌పై నిందలు మోపేందుకు ఆ దేశ దౌత్యవేత్తలు చేస్తున్న ప్రయత్నా లను ఆమె తప్పుబట్టారు. పాక్ ద్వంద్వవైఖరి, కపటత్వంపై సమయం వెచ్చించడం, దృష్టిపెట్టాల్సిన అవసరం లేదన్నారు. భారతదేశ ప్రజా స్వామ్యం పై పాక్ చేస్తున్న ఆరోపణలను ఎప్పటికప్పుడు తిప్పికొడుతున్న విషయాన్ని గుర్తు చేశారు. వారి ఆరోపణలు, అబద్ధాలు వాస్తవాలను మార్చలేవని భవిక అన్నారు. ఇటీవల కశ్మీరీ ప్రజలు ఎన్నికల్లో పాల్గొన్న విషయాన్ని ఆమె ఇక్కడ ప్రస్తావించారు. ఈసందర్భంగా ఆ దేశ సామాజిక, ఆర్థిక పురోగతి గురించి అందరికీ తెలుసని ఎద్దేవా చేశారు. కేంద్రపాలిత ప్రాంతాలైన జమ్మూకశ్మీర్, లద్దాఖ్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమేనని మంగళానందన్ పునరుద్ఘాటించారు. ఈ క్రమంలో మానవ హక్కుల పరిరక్షణకు భారత్ తీసుకుంటున్న చర్యలను ఆమె ఎత్తి చూపారు.

## నాకు వయసు లేదేమో గానీ.. పరిణతి ఉంది

### తేజస్వీ యాదవ్ కీలక వ్యాఖ్యలు




**బిహార్ :** బిహార్‌ని బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ ఖరారైన నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీలన్నీ దూకుడు పెంచాయి. ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ప్రచార జోరును పెంచారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వస్తే ప్రతి ఇంటికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని ఆర్జేడీ నేత హామీ ఇచ్చారు. ఈ హామీని అమలుచేయడంలో సాధ్యాసాధ్యాలపై మీడియా ఆయనను ప్రశ్నించగా, అందుకు తేజస్వీ బదులిస్తూ.. తనకు వయసు లేకపోవచ్చు కానీ.. పరిణతి ఉందన్నారు. దాని ఆధారంగానే హామీ ఇచ్చానని పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికో ప్రభుత్వ ఉద్యోగం, ఆర్థికన్యాయం, సమ్మిళిత వృద్ధితో బిహార్‌ను భారత్‌లోనే నంబర్ వన్ రాష్ట్రంగా మార్చాలనే లక్ష్యంతో తాను ముందుకువెళ్తున్నట్లు తెలిపారు. తాము అధికారంలోకి వస్తే రాష్ట్ర ప్రజలు ఉద్యోగాల కోసం, విద్యార్థులు కోచింగ్‌ల కోసం ఇళ్లు వదిలేసి.. ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదని తేజస్వీ అన్నారు. మూతబడిన జనపనార మిల్లుల పునరుద్ధరణ, ఆహార ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, ఐటీ పార్కులు, సెజ్‌ల అభివృద్ధి, బిహార్‌ను విద్యా కేంద్రంగా మార్చడం వంటి ప్రణా ళికలను సిద్ధం చేసుకున్నట్లు తేజస్వీ తెలిపారు. అభివృద్ధి బిహార్‌లోని ప్రతి ఇంటి గుమ్మం ముందుకు చేరుకునేలా చర్యలు తీసుకుంటూ.. స్వయం సమృద్ధిగల రాష్ట్రాన్ని సృష్టిస్తా మని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో అనేక పర్యాటక ప్రదేశాలు ఉన్నప్పటికీ ప్రభుత్వాలు పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయలేక పోయా యని తేజస్వీ యాదవ్ విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే.. బిహార్‌ను పర్యాటకంగానూ అభివృద్ధి చేసి..దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులకు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు.

## దిల్లీ పేరు మార్పునకు పెరుగుతోన్న డిమాండ్లు



**న్యూఢిల్లీ :** దేశ రాజధాని దిల్లీ పేరును మార్చాలనే డిమాండ్లు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఇటీవల దాని పేరును 'ఇంద్రప్రస్థ'గా మార్చాలంటూ విశ్వహిందూ పరిషద్ (వీహెచ్‌పీ) డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ అంశంపై భాజపా ఎంపీ ప్రవీణ్ ఖండేల్‌వాలా కూడా కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు లేఖ రాశారు. దిల్లీ పేరును 'ఇంద్రప్రస్థ'గా మార్చడం ద్వారా అది చారిత్రక, సాంస్కృతిక, నాగరికత మూలాలను ప్రతిబింబిస్తోందన్నారు. ఈక్రమంలో పాత దిల్లీ రైల్వేస్టేషన్, అంతర్జాతీయ విమానాశ్రయాల పేర్లను కూడా మార్చాలని డిమాండ్ చేశారు. దేశ రాజధానిలో పాండవుల విగ్రహాలను ఏర్పాటు చేయాలన్నారు. దేశంలోని ఇతర చారిత్రక నగరాలైన ప్రయాగ్‌రాజ్, అయోధ్య, ఉజ్జయిని, వారణాసి వంటివి వాటి మూలాలకు అనుగుణంగా ఉన్నాయన్నారు. అలాంటప్పుడు దిల్లీ ఎందుకు అలా ఉండకూడదని ఆయన ప్రశ్నించారు. ఈ మార్పు భావితరాల వారికి భారత చరిత్ర, సంస్కృతి, పాండవుల నీతి, ధర్మాన్ని తెలియజేస్తుందన్నారు. ఈ లేఖను అమిత్ షాతో పాటు దిల్లీ సీఎం రేఖా గుప్తా, ఇతర మంత్రులకు కూడా పంపించినట్లు ప్రవీణ్ పేర్కొన్నారు. వీహెచ్‌పీ గత నెలలో ఇలాంటి డిమాండే చేసింది. పురాతన చరిత్ర సంస్కృతితో అనుసంధానించేందుకు గాను దిల్లీ పేరును 'ఇంద్రప్రస్థ'గా మార్చాలని కోరింది. దిల్లీ సాంస్కృతిక శాఖ మంత్రి కపిల్ మిశ్రాకు వీహెచ్‌పీ దిల్లీ విభాగం కార్యదర్శి సురేంద్రకుమార్ గుప్తా ఈ మేరకు లేఖ రాశారు. ఈ పేరు మార్పు భారతీయ చరిత్ర, మహాభారత యుగంలోని మూలాలను ఆవిష్కరిస్తోందన్నారు.

## వారివి విభజన రాజకీయాలు..

### కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ



**బెగుసరాయ్ :** ఎన్నికల్లో గెలిచేందుకు ఎన్డీయే సర్కారు విభజన రాజకీయాలకు పాల్పడుతోందని కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీ ఆరోపించారు. నకిలీ జాతీయవాదాన్ని ప్రచారం చేస్తోందని విమర్శించారు. సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించలేకపోవడంతోనే.. ఓట్ల చోరీకి పాల్పడుతోందని భాజపాపై మండిపడ్డారు. ఓట్ల తొలగింపు అనేది హక్కుల ఉల్లంఘనతో సమానమని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బెగుసరాయ్‌లో తన తొలి ప్రచార సభలో ఈమేరకు ప్రసంగించారు. "దేశాభివృద్ధికి బిహార్ ఎంతో దోహదపడింది. కానీ, రాష్ట్రాభివృద్ధి విషయంలో మాత్రం వెనుకబడిపోయింది. నెహ్రూ, ఇందిరా గాంధీలను భాజపా నేతలు విమర్శి స్తున్నారు. నిరుద్యోగం, వలసల వంటి అసలైన సమస్యలను పట్టించుకోవడం లేదు. విభజన రాజకీ యాలు చేస్తున్నారు. అయినప్పటికీ.. సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లిం చలేకపోయారు. అందుకే ఓట్ల చోరీకి పాల్పడుతున్నారు" అని ప్రియాంక గాంధీ విమర్శలు గుప్పించారు. ఎన్డీయే వాగ్దానాలు చూసి మోసపోవద్దని ఓట ర్లకు సూచించారు. బిహార్‌లో డబుల్ ఇంజిన్ సర్కారు లేదని, ప్రతిదీ దిల్లీ నుంచి నియంత్రిస్తారని ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. ఎన్డీయే పాలనలో ప్రైవేటీకరణ పెద్దఎత్తున జరుగుతోందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రధాని మోదీ కొందరికి అప్పగించారని ఆరోపించారు. అంతకుముందు పట్నా విమా నాశ్రయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో 'ఇండియా' కూటమి విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. భాజపా కోటి ఉద్యోగాల హామీపై స్పందిస్తూ.. ఇన్నేళ్ల పాలనలో ఏం చేసిందని ప్రశ్నించారు.



## శబరిమల ఆలయంలో బంగారం దొంగతనం

### మాజీ ఇవోను అరెస్ట్ చేసిన క్రైమ్ బ్రాంచ్ పోలీసులు

**తిరువనంతపురం, నవంబర్ 1 :** శబరిమల అయ్యప్ప స్వామి ఆలయంలో బంగారం తాపడం పేరుతో జరిగిన మోసం కేసులో అధికారులు మాజీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సుధీశ్ కుమార్‌ను శనివారం అరెస్టు చేశారు. 2019లో శబరిమల ఈవోగా సుధీశ్ బాధ్యతలు నిర్వర్తించారు. తిరువనంతపురంలో క్రైం బ్రాంచ్ పోలీసులు దర్యాప్తు చేపట్టి అతన్ని అదుపులోకి తీసుకున్నారు. అయ్యప్ప స్వామి వద్ద ఉన్న ద్వారపాలకుల విగ్రహాల సమాచారాన్ని దాచిపెట్టినట్లు అతనిపై ఆరోపణలు ఉన్నాయి. బంగారు తాపడం ఉన్న ద్వారపాలకుల విగ్రహాలను.. కాపర్ షీట్లుగా దొంగ డాక్యుమెంట్లు సృష్టించినట్లు మాజీ ఈవోపై ఆరోపణలు ఉన్నాయి. ద్వారపాలకుల విగ్రహాల తాపడం కోసం వాటిని ఈ కేసులో ప్రధాన నిందితుడైన ఉన్నికృష్ణన్ పొట్టికి అందజేశారు. వాస్తవానికి ఆ విగ్రహాలకు 1998లో గోల్డ్ ప్లేటింగ్ జరిగింది. అయితే మళ్లీ 2019లో ఆ విగ్రహాలను ఈవోగా ఉన్న సుధీశ్ వాటిని ఉన్నికృష్ణన్‌కు అందజేశారు. ఆ విగ్రహాలను రాగితో ప్లేటింగ్ చేసి ఉన్నట్లు చూపించి, వాటిని ఉన్న బంగారాన్ని మాజీ ఈవో తీసుకెళ్లినట్లు ఈ కేసులో ఆరోపణలు వచ్చాయి. శబరిమల మాజీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బీ మురారి బాబును కూడా ఈ కేసులో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. మాజీ ఈవో కుమార్‌ను జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచనున్నారు.

# నేడు ఆస్ట్రేలియాతో మూడో టీ20



**హెూబర్ట్:** పొట్టి క్రికెట్ సిరీస్‌లో టీమ్ఇండియా పుంజుకోగలదా? సూర్యకుమార్ సేనకు మరో పరీక్ష సిద్ధం. ఆదివారమే ఆస్ట్రేలియాతో మూడో టీ20. బలమైన జట్టు ఉన్నా, రెండో టీ20లో తేలిపోయిన భారత్.. ఈ మ్యాచ్‌లోనైనా కంగారూల పేస్‌ను సమర్థంగా ఎదుర్కొంటుందా అన్నది చూడాలి. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఇద్దరూ గత మ్యాచ్‌లో ఎక్స్‌ట్రా బౌన్స్, సీమ్ మూమెంట్ ఉన్న బంతులను ఎదుర్కోవడంలో ఇబ్బందిపడ్డారు. వీళ్లిద్దరు బ్యాట్ ఝుళిపించడం జట్టుకు ఎంతో అవసరం. సంజు శాంసన్, తిలక్ వర్మ, శివమ్ దూబె కూడా పరుగుల బాట పట్టాల్సివుంది. అయితే ఆసీస్ ప్రధాన పేసర్ హేజిల్‌వుడ్ ఈ మ్యాచ్‌కు దూరం కావడం భారత్‌కు సానుకూలాంశమే. యాషెస్ సిరీస్ నేపథ్యంలో అతడికి విశ్రాంతినిచ్చారు. ఈ సిరీస్‌లో మిగతా మ్యాచ్‌ల్లోనూ హేజిల్‌వుడ్ ఆడడు. ఇక ఈ మ్యాచ్‌కైనా అర్ష్‌దీప్ సింగ్‌ను భారత జట్టులోకి తీసుకుంటారా అన్నది ఆసక్తికరం. టీ20ల్లో 100 వికెట్లు పడగొట్టిన ఏకైక భారత బౌలర్ అయినప్పటికీ అతణ్ని ఆడించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. "బుమ్రా ఆడితే జాబితాలో రెండో స్థానంలో అర్ష్‌దీప్ పేరు ఉండాలి. బుమ్రా లేకపోతే అర్ష్‌దీప్ పేరే మొదట ఉండాలి" అని మాజీ స్పిన్నర్ అశ్విన్ వ్యాఖ్యానించాడు. కుల్‌దీప్ స్థానంలో అర్ష్‌దీప్ జట్టులోకి వచ్చే అవకాశముంది. మరోవైపు ఆస్ట్రేలియా ధీమాగా బరిలోకి దిగుతోంది. హేజిల్‌వుడ్ స్థానంలో సీన్ అబాట్ జట్టులోకి రావొచ్చు. మణికట్టు గాయం నుంచి కోలుకున్న మ్యాక్స్‌వెల్.. ఒవెన్ లేదా షార్ట్ స్థానంలో ఆడతాడు. ఆదివారం మ్యాచ్‌కు ఎలాంటి వర్షం ముప్పు లేదు.




# సఫారీతో తాడోపేడో..

## నేడు ఇండియా-సౌతాఫ్రికా మధ్య ప్రపంచకప్ ఫైనల్

మహిళల వన్డే ప్రపంచ కప్‌ను టీమ్ఇండియా తొలిసారి సగర్వంగా అందుకోవాలని అభిమానులు ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. ఈసారి కొత్త ఛాంపియన్ అవతరించనుండటం గమనార్హం. టైటిల్ పోరుకు వచ్చిన దక్షిణాఫ్రికా కూడా ఇప్పటి వరకు ఒక్కసారి కూడా కప్‌ను గెలవలేదు. ఈ మెగా ట్రోఫీలో ఇరు జట్లూ ఒకసారి తలపడ్డాయి. విజయాన్ని భారత్ నుంచి సఫారీ జట్టు లాగేసుకుంది. గ్రూప్ స్టేజ్‌లో ఓడిపోయినా ఇప్పటికైతే నష్టం కలగలేదు. కానీ, ఫైనల్‌లో మాత్రం అదే ఫలితాన్ని పునరావృతం చేయకూడదు. ఇక్కడ ట్రోఫీనే కోల్పోవాల్సి వస్తుంది. అలా జరగకుండా ఉండాలంటే ఆ జట్టు బలాలపై దెబ్బ కొట్టాలి. స్టార్ ప్లేయర్లను కట్టడి చేసి విజయం సాధించాలి.

### సఫారీ బలం ఇదే..

ఈ వన్డే ప్రపంచ కప్‌లో అత్యధిక పరుగులు చేసిన జాబితాలో అగ్రస్థానం దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వాల్వార్డ్‌దే. 8 మ్యాచుల్లో 470 పరుగులు చేసింది. సెమీస్‌లో ఇంగ్లాండ్‌పై ఏకంగా 169 పరుగుల ఇన్నింగ్స్ ఆడింది. లారానే సఫారీ జట్టు బలం. ఆమెను కట్టడి చేస్తే మిగతా వారిని అడ్డుకోవడం పెద్ద కష్టం కాదు. గ్రూప్ స్టేజ్‌లో టీమ్ఇండియా పేస్ ధాటికి 81/5 స్కోరుకు పడిపోయింది. ఓవైపు లారా (70) క్రీజ్‌లో పాతుకుపోయింది. ఆ తర్వాత మన బౌలర్లు పట్టువదలడంతో ఆఖర్లో నదినె డి క్లార్క్ (84), ట్రైయన్ (49) విజృంభించి తమ జట్టును గెలిపించారు. మరోసారి వీరిపై దృష్టి పెట్టాల్సిందే. ఎందుకంటే సెమీస్‌లోనూ లారా ఆడకుండా ఉండుంటే ఇంగ్లాండ్‌పై (319) దక్షిణాఫ్రికా భారీ స్కోరు చేసి ఉండేది కాదు. అందుకే రేణుకా ఠాకూర్, క్రాంతి గౌడ్ టాప్ ఆర్డర్ పనిబడితే..




స్పిన్నర్లు శ్రీ చరణి, దీప్తి శర్మ, రాధా యాదవ్/స్నేహ్ రాణా మిగతా బ్యాటర్లను త్వరగా ఔట్ చేయాలి. ఇక సఫారీ జట్టు బౌలింగ్‌తోనూ భారత్‌కు ఇబ్బందులు తప్పవు. ఆ జట్టు ప్రధాన పేసర్ కాప్ చురకత్తుల్లాంటి బంతులను సంధిస్తూ ప్రత్యర్థులను ఒత్తిడికి గురి చేస్తోంది. అత్యంత బలమైన ఇంగ్లాండ్ బ్యాటింగ్ లైనప్ కకావికలం చేయడంలో 'కాప్'దే కీలక పాత్ర. ఒకే ఓవర్‌లో అత్యంత ప్రమాదకరమైన ఆమీ జోన్స్, హీథర్ నైట్‌ను బౌల్డ్ చేసి సంచలనం సృష్టించింది. ఐదు వికెట్ల ప్రదర్శన చేసింది. ఆమెతోపాటు 'ఖాఖా' కూడా డేంజరే. మిగతా బౌలర్లను భారత బ్యాటర్లు తేలికగానే ఎదుర్కోవచ్చు. అయితే, పిచ్ స్పిన్‌కు అనుకూలంగా ఉంటే మాత్రం ట్రైయన్‌తోనూ జాగ్రత్తగా ఉండాల్సిందే.

### మన సత్తా ఇదే..

టీమ్ఇండియా బలం గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్, హర్మన్ ప్రీత్, రిచా ఘోష్, దీప్తి శర్మ.. బ్యాటింగ్ లైనప్ దుర్భేద్యంగా ఉంది. వరల్డ్‌కప్‌లోకి అనూహ్యంగా వచ్చిన షెఫాలీ వర్మ పెద్దగా రాణించకపోయినా.. ఆమె దూకుడు మాత్రం బాగుంది. టోర్నీకి అలవాటు పడేందుకు ఆసీస్‌తో మ్యాచ్ సరిపోతుంది. ఫైనల్‌లో ఆమె నుంచి భారీ ఇన్నింగ్స్ వచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఐదు బంతులే ఎదుర్కొన్నప్పటికీ రెండు ఫోర్లు బాది తన లక్ష్యం ఏంటో చెప్పింది. కాప్, ఖాఖా బౌలింగ్‌ను స్మృతి మంధానతో కలిసి షెఫాలీ ఆడటంపైనే భారత్ అవకాశాలు మెండుగా ఉంటాయి. ఆఖర్లో రిచా ఘోష్ మెరిస్తే తిరుగుండదు. అయితే, దక్షిణాఫ్రికా బౌలింగ్ ఎటాక్‌ను భారత బ్యాటర్లు పంచుకుంటే ఎలాంటి ఇబ్బంది లేకుండా విజయం సాధించడం తేలికవుతుంది. అయితే, ఇక్కడ కూర్పే ప్రధానం కానుంది. ఐదుగురు ప్రధాన బౌలర్లతోనే బరిలోకి దిగుతుందా? అదనంగా బౌలర్‌ను తీసుకుంటుందా? అనేది ఆసక్తికరమే. ఎందుకంటే అమన్‌జ్యోత్‌ను ఆరో బౌలర్‌గా మేనేజ్‌మెంట్ వినియోగిస్తోంది. దక్షిణాఫ్రికా లోయర్ ఆర్డర్‌పైనా దృష్టి పెట్టాలంటే మెయిన్ బౌలర్ అవసరం ఉంటుందనేది విశ్లేషకుల అంచనా.

# గంభీర్ నిర్ణయాలు అర్థం కావడం లేదు : ఆరోన్ ఫించ్




ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్‌లో మొదటి మ్యాచ్ వర్షం కారణంగా రద్దైంది. ఇక రెండో మ్యాచ్‌లో భారత్‌కు ఓటమి తప్పలేదు. అయితే, ఇక్కడ మేనేజ్‌మెంట్ తీసుకుంటున్న నిర్ణయాలు చర్చకు దారితీశాయి. ఇటు బ్యాటింగ్ ఆర్డర్‌తో పాటు తుది జట్టులో అర్ష్‌దీప్ సింగ్‌కు అవకాశం ఇవ్వకపోవడంపై విమర్శలు వచ్చాయి. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటాడో అర్థంకావడం లేదని మాజీలు అభిప్రాయపడు తున్నారు. టీమ్ఇండియా టాప్ వికెట్ టేకర్ అర్ష్‌దీప్ సింగ్‌ను బెంచ్‌కే పరిమితం చేయడం తనను ఆశ్చర్యానికి గురి చేసిందని ఆసీస్ మాజీ కెప్టెన్ ఆరోన్ ఫించ్ వ్యాఖ్యానించాడు. "అర్ష్‌దీప్ సింగ్ కచ్చితంగా తుది జట్టులో ఉండాలి. కనీసం మూడో టీ20లోకైనా తీసుకోవాలి. మరీ ఎక్కువగా బ్యాటర్లతోనే వెళ్లినా మ్యాచులు గెలవడం కష్టమని తెలుసు. భారత్ కూడా ఇలా అదనంగా బ్యాటర్‌ను తీసుకొని ప్రయోగాలు చేస్తోంది. ఇదంతా వరల్డ్ కప్ కోసమే అయినా.. బౌలింగ్ విభాగం కూడా కీలకమే. మెగా టోర్నీలో గెలవాలంటే కేవలం బ్యాటింగ్‌తోనే అది సాధ్యం కాదు. సరైన కూర్పుతో బరిలోకి దిగాలి. రెండో టీ20లో భారత బౌలర్లు తేలిపోవడానికి కారణం స్కోరు బోర్డుపై తగినన్ని పరుగులు లేవు. ఇంకాస్త అదనంగా ఉండుంటే పరిస్థితి భిన్నంగా ఉండేది" అని ఫించ్ తెలిపాడు. అర్ష్‌దీప్ సింగ్ కాకుండా హర్షిత్ రాణాకు తుది జట్టులో అవకాశం దక్కింది.

### అభిషేక్ సూపర్..

"అభిషేక్ శర్మ ఇన్నింగ్స్ బాగుంది. ఓ వైపు వికెట్లు పడుతున్నా సరే.. తనదైన శైలిలో దూకుడుగా ఆడుతూనే సంయమనం పాటించాడు. అతడు స్ట్రైకింగ్ వచ్చినప్పుడు ఆసీస్ బౌలర్లకు కష్టంగా మారింది. అయితే, మిచెల్ మార్ష్ మాత్రం అభిషేక్‌ను ఎక్కువ స్ట్రైకింగ్‌కు రాకుండా చేయడంలో సఫలమయ్యాడు. లేకపోతే భారత్ ఇంకొన్ని పరుగులు చేసి ఉండేది. అప్పుడు ఆసీస్‌కు లక్ష్య ఛేదన కాస్త క్లిష్టంగా మారేది" అని ఫించ్ వ్యాఖ్యానించాడు. టీమ్ఇండియా రెండో టీ20లో 125 పరుగులకు ఆలౌటైంది. అందులో అభిషేక్ శర్మ 68 పరుగులు చేయగా.. హర్షిత్ రాణా 35 పరుగులు చేశాడు. మరే ఇతర బ్యాటరూ డబుల్ డిజిట్ చేయకపోవడం గమనార్హం. అనంతరం ఆసీస్ టార్గెట్‌ను 13.2 ఓవర్లలో ఛేదించింది. దీంతో ఐదు టీ20ల సిరీస్‌లో 1-0 ఆధిక్యం సాధించింది. మూడో మ్యాచ్ ఆదివారం హెూబర్ట్ వేదికగా జరగనుంది. "భారత జట్టు మేనేజ్‌మెంట్ ఇకనైనా కుర్చీలాటను ఆపాలి. బ్యాటింగ్ ఆర్డర్‌లో తరచూ మారుస్తూ ఉండటం సరికాదు. రెండో టీ20లో ఆసీస్‌పై 160 లేదా 170 పరుగులు చేసి ఉంటే విజయం సాధించే అవకాశాలు ఉండేవి. తొలి మ్యాచ్‌లో సూర్యకుమార్ బాగా ఆడలేదా? నాటౌట్‌గా నిలవలేదా? అయినా సరే రెండో మ్యాచ్‌లో అతడి స్థానాన్ని మార్చారు. సంజు శాంసన్‌ను తీసుకొచ్చారు. ఓపెనింగ్ నుంచి ఐదో స్థానం వరకూ ఆడిస్తూనే ఉన్నారు.

# ప్రపంచకప్ గెలిస్తే..

## అమ్మాయిలకు బీసీసీఐ భారీ బొనాంజా..

మహిళల వన్డే ప్రపంచ కప్ తుది అంకానికి చేరుకుంది. ఆదివారం ముంబయి వేదికగా జరగనున్న ఫైనల్‌లో భారత్‌తో దక్షిణాఫ్రికా తలపడనుంది. ఈ రెండు జట్లు ఇప్పటివరకు టైటిల్ సాధించకపోవడంతో ఈ సారి కొత్త ఛాంపియన్‌ను చూడబోతున్నాం. ఇప్పటివరకు రెండుసార్లు (2005, 2017) ఫైనల్ చేరినా భారత్ విశ్వవిజేతగా నిలవలేకపోయింది. ఇప్పుడు మూడోసారి అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతోంది. సెమీస్‌లో బలమైన ఆస్ట్రేలియాను ఓడించి ఊపుమీదున్న హర్మన్‌ప్రీత్ సేన.. తుది పోరులోనూ అదే జోరును కొనసాగించి కప్‌ను ఎగరేసుకుపోవాలని అభిమానులు కోరుకుంటున్నారు. భారత అమ్మాయిలు ప్రపంచ కప్ సాధిస్తే.. వారికి భారీ బొనాంజా ఇవ్వాలని బీసీసీఐ యోచిస్తోందని సమాచారం. భారత పురుషుల జట్టు 2024 టీ20 ప్రపంచ కప్ గెలిచినప్పుడు ఆటగాళ్లు, సహాయక సిబ్బందికి కలిపి బీసీసీఐ రూ.125 కోట్ల ప్రైజ్‌మనీని అందించింది. ఒకవేళ హర్మన్‌ప్రీత్ సేన విశ్వవిజేతగా నిలిస్తే అంతే మొత్తంలో నజరానా ప్రకటించాలని బోర్డు డిసైడ్ అయినట్లు తెలుస్తోంది. 'పురుషులు, మహిళా క్రికెటర్లకు బీసీసీఐ సమానంగా వేతనాలు చెల్లిస్తోంది. అందువల్ల భారత మహిళల జట్టు ప్రపంచ కప్ గెలిస్తే పురుషుల టీమ్ టీ20 ప్రపంచ కప్ సాధించినప్పుడు ఎంత మొత్తంలో నజరానా ప్రకటించారో ఇప్పుడు కూడా అంతే స్థాయిలో బొనాంజా ప్రకటించడం కోసం చర్చలు జరుగుతున్నాయి. కానీ, భారత్ వరల్డ్ కప్ గెలవక ముందే ప్రకటన చేయడం మంచిది కాదు' అని




బీసీసీఐ వర్గాలు పీటీఐకి తెలిపాయి. లార్డ్స్‌లో జరిగిన 2017 ప్రపంచ కప్ ఫైనల్‌లో ఇంగ్లాండ్ చేతిలో భారత్ 9 పరుగుల తేడాతో ఓడిపోయింది. అప్పుడు భారత జట్టులోని ప్రతి ప్లేయర్‌కు బీసీసీఐ రూ.50 లక్షల చొప్పున ప్రైజ్‌మనీ ఇచ్చింది. సహాయక సిబ్బందికి ఒక్కొక్కరికి రూ.25 లక్షలు అందించింది. 2024 టీ20 ప్రపంచ కప్‌ను టీమ్ఇండియా సాధించిన సంగతి తెలిసిందే. రోహిత్ శర్మ నేతృత్వంలోని భారత జట్టు బార్బడోస్ వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగిన ఫైనల్‌లో 7 పరుగుల తేడాతో గెలిచి విశ్వవిజేతగా నిలిచింది. 17 ఏళ్ల నిరీక్షణ తర్వాత భారత్ పొట్టి కప్పును సాధించడం విశేషం. ఈ మ్యాచ్ ముగిసిన అనంతరం రోహిత్, విరాట్ కోహ్లీ అంతర్జాతీయ టీ20 కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటించారు.

# ప్రొఫెషనల్ టెన్నిస్‌కు రిటైర్మెంట్ పలికిన రోహన్ బోపన్న

భారత టెన్నిస్ లెజెండ్ రోహన్ బోపన్న ప్రొఫెషనల్ టెన్నిస్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించాడు. భారత టెన్నిస్‌పై చెరగని ముద్ర వేసిన 45 ఏళ్ల బోపన్న రెండు దశాబ్దాలకుపైగా కెరీర్‌ను కొనసాగించాడు. అతని చివరి మ్యాచ్ పారిస్ మాస్టర్స్ 1000లో అలెగ్జాండర్ బుబ్లిక్‌తో కలిసి డబుల్స్ ఆడాడు. బోపన్న సుదీర్ఘకాలం భారత టెన్నిస్‌కు మూలస్తంభంగా నిలిచాడు. గాయాలు బాధించినా.. రెండు మోకాళ్లలోని గుజ్జు (కార్టిలేజ్) అరిగిపోయి ఇబ్బంది పడ్డా.. వరుసగా ఓటములు ఎదురైనా.. అతను ఆగిపోలేదు. 2019లో రోజుకు రెండు లేదా మూడు పెయిన్ కిల్లర్స్ మాత్రలు వేసుకుంటూ బోపన్న ఆట కొనసాగించాడు. ఆట పట్ల అతని అంకితభావానికి ఇంతకంటే నిదర్శనం ఏముంటుంది? ఈ సమస్య నుంచి బయటపడేందుకు బోపన్నకు యోగా ఉపయోగపడింది. కరోనా సమయంలో 2020లో బోపన్న.. అయ్యంగార్ యోగా చేయడం మొదలెట్టాడు. వారంలో నాలుగు సార్లు



90 నిమిషాల చొప్పున యోగా చేసేవాడు. దీంతో క్రమంగా మోకాలి నొప్పి మాయమైంది. ఎలాంటి మాత్రలు వాడాల్సిన అవసరం లేకపోయింది. అక్కడి నుంచి అతని కెరీర్ మళ్లీ కొత్తగా మొదలైంది. మరింత ఉత్సాహంతో బోపన్న కోర్టులో సాగిపోయాడు.




# వాహన విక్రయాలు రయ్‌రయ్..

## దుమ్మురేపిన మారుతీ సుజుకీ

పండగ సీజన్ వేళ దేశీయంగా వాహన విక్రయాలు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. పండగ డిమాండ్‌కు జీఎస్టీ 2.0 సంస్కరణలు తోడవ్వడంతో టోకు వాహన విక్రయాల్లో పెద్ద సంఖ్యలో విక్రయాలు నమోదయ్యాయి. ప్రముఖ కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ ఎన్నడూలేని రీతిలో విక్రయాలు నమోదుచేయగా.. హ్యుందాయ్, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్ మెరుగైన అమ్మకాలతో రాణించాయి. దేశీయ అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ అక్టోబర్ నెలలో మొత్తం 2,20,894 వాహనాలను విక్రయించంది. దేశీయంగా 180,675 యూనిట్లు విక్రయించగా.. 31,304 వాహనాలను ఎగుమతి చేసింది. 8,915 యూనిట్లను ఇతర సంస్థలకు విక్రయించింది. మరో కార్ల తయారీ సంస్థ హ్యుందాయ్ మోటార్ ఇండియా అక్టోబర్ నెలలో 69,894 యూనిట్లను విక్రయించింది. 53,792 యూనిట్లను దేశీయంగా విక్రయించగా.. 16,102 యూనిట్లను ఎగుమతి చేసింది. క్రెటా, వెన్యూ మోడళ్లు ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో హ్యుందాయ్ స్థానాన్ని పదిలంగా ఉంచాయి. టాటా ప్యాసింజర్ వెహికల్స్ లిమిటెడ్ మొత్తం 61,295 యూనిట్లను విక్రయించింది. గతేడాది ఇదే నెలలో 48,423 యూనిట్లతో పోలిస్తే విక్రయాల్లో 26.6 శాతం వృద్ధి నమోదైంది. ఇందులో 47 వేల యూనిట్లు ఎస్‌యూవీలు కాగా, 9,286 ఎలక్ట్రిక్ వాహనాలు అమ్ముడయ్యాయి. నవరాత్రి నుంచి దీపావళి మధ్య లక్ష వాహనాలను డెలివరీ చేసినట్లు కంపెనీ తెలిపింది. మహీంద్రా అండ్ మహీంద్రా 1.2 లక్షల వాహనాలను విక్రయించింది. ఇందులో దేశీయంగా 71,624 పాసింజర్ వాహనాలు ఉన్నాయి. 4,015 యూనిట్లను ఎగుమతి చేసింది. త్రీవీలర్ సెగ్మెంట్‌లో 12,762 యూనిట్లను విక్రయించింది. టయోటా కిర్లోస్కర్ మోటార్ 40,257 వాహనాలను దేశీయంగా విక్రయించింది. 2,635 యూనిట్లను ఎగుమతి చేసింది. మరో కార్ల తయారీ సంస్థ కియా కూడా మెరుగైన అమ్మకాలను నమోదు చేసింది. గతేడాదితో పోలిస్తే 30 శాతం వృద్ధితో 29,556 పాసింజర్ వాహనాలను విక్రయించింది. సోనెట్, కరెన్స్ క్లావిస్, కరెన్స్ క్లావిస్ ఈవీ, సెల్టోస్ మెరుగైన విక్రయాలకు దోహదపడ్డాయి. ప్రముఖ ద్విచక్ర, త్రిచక్ర వాహన తయారీ సంస్థ టీవీఎస్ మోటార్ కంపెనీ అంచనాలను మించి రాణించింది. అక్టోబర్ నెలలో 5.43 లక్షల యూనిట్లను విక్రయించింది. టూవీలర్ సెగ్మెంట్‌లో 5.25 లక్షల వాహనాలను విక్రయించగా.. త్రీవీలర్ సెగ్మెంట్‌లో 18,407 యూనిట్ల అమ్మకాలను చేపట్టింది.




# జీఎస్టీ రేట్లు తగ్గించినా..

## రూ.2 లక్షల కోట్లకు చేరువలో వసూళ్లు

దిల్లీ: వస్తు, సేవల పన్ను వసూళ్లు మరోసారి రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. జీఎస్టీ రేట్లు తగ్గించినా.. పండగ కొనుగోళ్లు కలిసొచ్చాయి. దీంతో అక్టోబర్ నెలలో రూ.1.96 లక్షల కోట్ల మేర వసూళ్లు నమోదయ్యాయి. ఈ మేరకు ప్రభుత్వం శనివారం అధికారిక గణాంకాలను విడుదల చేసింది. గతేడాదితో పోల్చినప్పుడు ఈ మొత్తం 4.6 శాతం మేర పెరిగింది. కిచెన్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ సహా మొత్తం 375 రకాల ఉత్పత్తులపై సెప్టెంబర్ 22 నుంచి జీఎస్టీ రేట్లను తగ్గించిన సంగతి తెలిసిందే. దసరా నవరాత్రుల ప్రారంభం నుంచి ఈ కొత్త రేట్లు అమల్లోకి వచ్చాయి. ఒకవైపు రేట్లు తగ్గించినా నవరాత్రులు, దీపావళి పండగల నేపథ్యంలో కొనుగోళ్లు భారీ స్థాయిలో పెరిగాయి. దీపావళికి ముందే జీఎస్టీ రూపంలో శుభవార్త వింటారంటూ ప్రధాని మోదీ తన స్వాతంత్ర్య దినోత్సవం ప్రసంగంలో పేర్కొనడంతో చాలా మంది కొనుగోళ్లను వాయిదా వేసుకోవడమూ మరో కారణం. గతేడాది అక్టోబర్ నెలలో జీఎస్టీ రూపంలో రూ.1.87 లక్షల కోట్లు వసూలు జరగ్గా.. ఆ మొత్తం 1.96 లక్షల కోట్లకు పెరిగింది. ఈ ఏడాది ఆగస్టులో ఈ మొత్తం రూ.1.86 లక్షలు కోట్లు కాగా.. సెప్టెంబర్‌లో 1.89 లక్షలు కోట్లుగా నమోదైంది. గతేడాదితో పోల్చినప్పుడు 4.6 శాతం వృద్ధి కనిపించింది. గడిచిన నెలలతో పోల్చి చూసినప్పుడు సగటున 9 శాతం వృద్ధి కంటే తక్కువ నమోదు కావడం గమనార్హం. అక్టోబర్ నెల మొత్తం వసూళ్లలో రూ.1.45 లక్షల కోట్లు దేశీయ వినియోగానికి సంబంధించినవి కాగా.. దిగుమతులపై సుంకాల ద్వారా రూ.50,884 కోట్లు సమకూరాయి. జీఎస్టీ రిఫండ్స్ రూ.26,934 కోట్లు మినహాయిస్తే నికర జీఎస్టీ వసూళ్లు రూ.1.69 లక్షల కోట్లుగా నమోదయ్యాయి.



# నీతా అంబానీ @62..

## పుట్టినరోజు వేళ శుభాకాంక్షలు వెల్లువ

ముంబయి: నేడు రిలయన్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, చైర్‌పర్సన్ నీతా అంబానీ 62వ పుట్టినరోజు. రిలయన్స్ చైర్మన్ ముకేశ్ అంబానీ భార్యగానే కాకుండా.. ఓ తల్లిగా, వ్యాపారవేత్తగా, వితరణశీలిగా ఆమె సమాజంలో గుర్తింపు పొందారు. రిలయన్స్ ఫౌండేషన్ ద్వారా ఆమె చేపట్టిన సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత చేరువయ్యారు. విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, క్రీడలు, సాంస్కృతిక విభాగం, విపత్తులు వంటి సమయాల్లో ఫౌండేషన్ తరఫున ఆపన్నహస్తం అందిస్తున్నారు. తద్వారా ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారంటూ ఆమె పుట్టినరోజు వేళ రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. నీతా అంబానీకి క్రీడలు, కళలన్నా ఆసక్తి. భారత్‌లో ఒలింపిక్స్ నిర్వహణకు సంబంధించి ఒలింపిక్ కమిటీ సభ్యురాలిగా తనవంతు కృషి చేస్తున్నారు. ముంబయి ఇండియన్స్ ఐపీఎల్ ఫ్రాంచైజీకి యజమానిగానూ వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో 'హ్యాపీ బర్త్‌డే మేడమ్' అంటూ ముంబయి ఇండియన్స్ టీమ్ కూడా ఆమెకు శుభాకాంక్షలు తెలియజేసింది. పలువురు ప్రముఖులు కూడా శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో ఉన్నారు.

www.rajamudranews.com
రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక



# పని లేకపోతే జైల్లో ఉన్నట్టే.. : రాజశేఖర్




ఖాళీగా ఉండడం తనకు నచ్చదని ప్రముఖ నటుడు రాజశేఖర్ అన్నారు. వర్క్ లేకపోతే జైల్లో ఉన్నట్టే ఉంటుందని అభిప్రాయపడ్డారు. తాను కీలక పాత్ర పోషించిన 'బైకర్' గ్లింప్స్ లాంచ్ ఈవెంట్‌లో మాట్లాడారు. "దర్శకుడు ఈ గ్లింప్స్‌ని నాకు ముందే చూపించి ఉంటే.. హీరో పాత్రనే అడిగేవాడిని. అంతా అయిపోయాక చూపించారు" అంటూ నవ్వులు పూయించారు. నాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకుంటూ.. "ఓ సినిమా షూటింగ్ కోసం ఫారిన్ వెళ్లాం. మా ఫొటోగ్రాఫర్ రాకపోవడంతో అక్కడ ఫొటోగ్రాఫర్‌ను తీసుకున్నాం. ఆయన ఫొటోలు తీస్తూ.. 'ఎన్నేళ్లుగా ఇండస్ట్రీలో ఉన్నారు? తర్వాత ఏం చేయబోతున్నారు?' అని అడిగాడు. అప్పటికే నేను అంగీకరించిన కొన్ని ప్రాజెక్టుల గురించి చెప్పా. 'మీరు చాలా లక్కీ' అన్నాడు. ఎందుకని ప్రశ్నిస్తే.. మీ చేతి నిండా పని ఉంది అని సమాధానమిచ్చాడు. ఆ విషయాన్ని అప్పుడు నేను పెద్దగా పట్టించుకోలేదు. కానీ, తర్వాత అర్థమైంది. పని లేకపోతే నాకు జైల్లో ఉన్నట్టే ఉంటుంది. కరోనా టైమ్‌లో నాది నడవలేని పరిస్థితి. రెండు, మూడు నెలల్లో కోలుకున్నా. అయినా సరిపోదు కదా. వర్క్ కావాల్సిందే. హీరోగా దాదాపు వంద సినిమాలు చేశా. ఇకపై ఏ రోల్ వచ్చినా చేయాలని ఓరోజు ఫిక్స్ అయ్యా. ఆ క్రమంలోనే ఎంతోమంది దర్శకులు కథలు వినిపించారు. నాకు నచ్చకపోవడంతో వాటిని తిరస్కరించా. మంచి స్టోరీ రావట్లేదేంటన్న నిరుత్సాహంలో ఉన్నప్పుడు అభిలాష్ వచ్చారు. ఆయన చెప్పిన 'బైకర్' స్క్రిప్టు నచ్చింది. ఓ నటుడిగా రోజూ సెట్స్ నుంచి సంతృప్తితో ఇంటికి వెళ్లేవాడిని" అని పేర్కొన్నారు.

## డ్రామాతో పాటు కామెడీ కూడా కావాలి

హిందీ సీరియల్ ద్వారా వచ్చి తన నటనతో అందరినీ ఆశ్చర్యపరిచిన మృణాల్ 'సీతారామం'తో హీరోయిన్‌గా మారిపోయింది. ఈ మూవీలో దుల్కర్ సల్మాన్ సరసన సంప్రదాయ లుక్‌లో కనిపించి కుర్రాళ్ల హృదయాలను కొల్లగొట్టింది. మొదటి మూవీతోనే హిట్ రావడంతో మృణాల్ రేంజ్ మారిపోయింది. ఈక్రమంలోనే వరుస అవకాశాలు క్యూ కట్టాయి. అలా పలు చిత్రాల్లో నటించిన ఈ భామ ఇప్పుడు భాషతో సంబంధం లేకుండా వరుస ప్రాజెక్ట్స్‌ను లైన్‌లో పెడుతోంది. ప్రస్తుతం మృణాల్, వరుణ్ ధావన్, పూజా హెగ్డే ఓ సినిమా చేస్తున్నారు. 'హై జవానీ తో హై ఇష్క్ హోనా హై' టైటిల్‌తో రాబోతున్న ఈ చిత్రానికి డేవిడ్ ధావన్ దర్శకత్వం వహిస్తుండగా.. రమేష్ తరణి నిర్మిస్తున్నారు. కామెడీ అండ్ రొమాంటి నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ మూవీ వచ్చే ఏడాది ఏప్రిల్ 10న విడుదల కావాల్సి ఉండగా.. పలు కారణాల వల్ల వాయిదా పడినట్లు సమాచారం. తాజాగా, ఈ విషయంపై మృణాల్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా స్పందించింది. 'హై జవానీ తో హై ఇష్క్ హోనా హై' సినిమా జూన్ 5న థియేటర్స్‌లోకి రాబోతున్నట్లు తెలుపుతూ.. డ్రామాతో పాటు కామెడీ కూడా కావాలని రాసుకొచ్చింది. దీంతో అది చూసిన నెటిజన్లు వెయిటింగ్ అంటూ కామెంట్లు పెడుతున్నారు.

# కథ పాతదే అయినా.. జాతర కొత్తది



## అభిమానులకు రవితేజ మాస్ జాతర

**ఖాకీ కథలు రవితేజకు బాగా అచ్చొచ్చిన జానర్. క్రాక్, పవర్, విక్రమార్కుడు.. ఇలా ఆయన కెరీర్‌లో పోలీస్ కథలతో కొట్టిన హిట్లు అనేకం. ఇప్పుడాయన మాస్ జాతర కోసం రైల్వే పోలీస్‌గా మారారు. లక్ష్మణ్ భేరి (రవితేజ) నిజాయితీ గల రైల్వే పోలీస్. తన కళ్ల ఎదురుగా అన్యాయం జరిగితే.. అది తన పరిధిలోనిది కాకున్నా దాన్ని తన ఆధీనంలోకి తెచ్చుకుని మరీ న్యాయం చేసే ప్రయత్నం చేస్తుంటాడు. ఈ క్రమంలోనే వరంగల్‌లో పని చేసే సమయంలో ఓ మంత్రి కొడుక్కి తనదైన శైలిలో బుద్ధి చెప్తాడు. తర్వాత తను అల్లూరి జిల్లాలోని అడవివరం రైల్వే స్టేషన్‌కు ట్రాన్స్‌ఫర్ అవుతాడు.**

కొండల మధ్య ఉండే గిరిజన ప్రాంతాన్ని శివుడు (నవీన్ చంద్ర) శాసిస్తుంటాడు. ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లోని రైతులతో శీలావతి రకం గంజాయిని పండించి.. దాన్ని కోల్‌కతాకు స్మగ్లింగ్ చేస్తుంటాడు. లక్ష్మణ్ ఆ ఊర్లోకి అడుగు పెట్టడంతోనే శివుడికి ఎదురు వెళ్లడం మొదలు పెడతాడు. జిల్లా ఎస్పీ నుంచి మొదలు.. మొత్తం రాజకీయ వ్యవస్థ అండగా ఉన్న శివుడ్ని ఓ మామూలు రైల్వే ఎస్సై ఎలా అడ్డుకున్నాడు? అతని గంజాయి సామ్రాజ్యాన్ని ఎలా కూలదోశాడు?ఈ కథలో తులసి (శ్రీలీల), హనుమాన్ భేరి (రాజేంద్ర ప్రసాద్)ల పాత్రలకు ఉన్న ప్రాధాన్యత ఏంటి? అన్నది మిగిలిన కథ. కొత్త దర్శకులు అగ్రతారలతో జట్టు కట్టారంటే చాలు సినీప్రియుల్లో, అభిమానుల్లో ఓ నూతనోత్సాహం కనిపిస్తుంటుంది. తమ అభిమాన కథానాయకుడ్ని ఎంత కొత్తగా తెరపై చూపిస్తారు..? అతనితో ఎలాంటి వినూత్నమైన కథ చెప్పిస్తారనే ఆసక్తి అందరిలోనూ కనిపిస్తుంటుంది. ఈ అంచనాల్ని దృష్టిలో పెట్టుకునే దర్శకుడు భాను భోగవరపు దీంట్లో రవితేజ పాత్రను వింటేజ్ ఎనర్జీతో పవర్‌ఫుల్‌గా తెరపై ఆవిష్కరించారు. రవితేజ నుంచి కోరుకునే ఎంటర్‌టైన్‌మెంట్, మాస్ యాక్షన్ అంశాల్ని మేళవిస్తూనే ఆయన ఒకప్పటి బెంచ్ మార్క్ హిట్స్‌ను గుర్తు చేసుకునేలా కొన్ని హైమూమెంట్స్‌ను అందించే ప్రయత్నం చేశారు. అయితే కథలో కొత్తదనం కనిపించలేదు. రవితేజ ఇప్పటికే ఇలాంటి రొటీన్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చాలా చేసేశాడు కదా అని ప్రేక్షకుడికి అనిపిస్తుంది. రవితేజలోని హైఎనర్జీని రుచి చూపిస్తూ మంచి యాక్షన్ సీక్వెన్స్‌తో ఆయన పాత్రను తెరకు పరిచయం చేసిన తీరు ఆకట్టుకుంటుంది. ఆ వెంటనే తన కుటుంబ నేపథ్యాన్ని.. తాతతో ఉన్న అనుబంధాన్ని.. పెళ్లి కాకపోవడానికి వెనకున్న కారణాల్ని ఫన్నీగా చూపించే ప్రయత్నం చేశారు. శివుడిగా నవీన్‌చంద్ర విలనిజాన్ని.. తన గంజాయి స్మగ్లింగ్ దందాను పరిచయం చేస్తూ కథలో సంఘర్షణకు బీజం వేసిన విధానం ఫర్వాలేదనిపిస్తుంది. హీరో అడవివరంకి ట్రాన్స్‌ఫర్ అవడం.. అక్కడ తనకు శివుడి గ్యాంగ్‌కు మధ్య జరిగే చిన్నపాటి గొడవలతో కథ కాస్త వేగం పుంజుకుంటుంది. శివుడు గంజాయి స్మగ్లింగ్ కోసం రైల్వేని ఉపయోగించుకోవాలని నిర్ణయించుకోవడం.. దాన్ని అడ్డుకునేందుకు హీరో రంగంలోకి దిగడంతో అసలు కథ మొదలవుతుంది. ఈ క్రమంలో ఊరి ప్రజలతో హీరో చేసే యాక్షన్ సీక్వెన్స్ థ్రిల్ పంచుతుంది. హీరోని చంపేందుకు శివుడి మామ రంగంలోకి దిగడం.. ఈ క్రమంలో అడవిలో వాళ్ల మధ్య వచ్చే ఫైట్ సీక్వెన్స్ రోమాంచితంగా ఉంటుంది. శివుడి ఇంటికొచ్చి హీరో చేసే విధ్వంసం కూడా థ్రిల్ పంచుతుంది. ప్రీ క్లైమాక్స్‌లో రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్‌గా హనుమాన్ భేరి పాత్రలో రాజేంద్రప్రసాద్ చేసే యాక్షన్ హంగామా అలరిస్తుంది. ఈ సినిమాని పూర్తిగా రవితేజ తన భుజాలపై మోశారు. వింటేజ్ స్టైల్, శ్వాగ్, ఎనర్జీతో లక్ష్మణ్ భేరిగా తెరపై ఆయన చేసిన సందడి.. ÷ట్స్, పాటల్లో చూపించిన హుషారు.. తనదైన కామెడీ టైమింగ్.. అన్నీ ప్రేక్షకుల్ని అలరిస్తాయి. శ్రీలీల రవితేజతో కలిసి ఆమె వేసిన హుషారైన స్టెప్పులు మెప్పిస్తాయి. అభిమానులు మెచ్చేలా రవితేజను ఎనర్జిటిక్‌గా చూపించడంలో సఫలమయ్యారు.

## విడుదలకు రెడీగా ఆంధ్ర కింగ్ తాలూకా

ఈ నెలాఖరున ఆంధ్ర కింగ్ తాలూకా చిత్రంతో థియేటర్లలో సందడి చేయనున్నారు కథానాయకుడు రామ్ పోతినేని. ఆయన.. భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన ఈ సినిమాని పి. మహేశ్‌బాబు తెరకెక్కించారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించింది. ఉపేంద్ర కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రంలోని చిన్ని గుండెలో అంటూ సాగే మెలోడీ గీతాన్ని శుక్రవారం విడుదల చేశారు. ఈ పాటకు వివేక్ మెర్విన్ స్వరాలు సమకూర్చగా.. కృష్ణకాంత్ సాహిత్యమందించారు. మెర్విన్ సోలమన్, సత్య యామిని ఆలపించారు. ఈ పాటలో రామ్ భాగ్యశ్రీల కెమిస్ట్రీ ఆకర్షణగా నిలిచింది. వినూత్నమైన రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా మ-ఎస్తాబైన ఈ సినిమా ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉంది. దీన్ని ఈ నెల 28న విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే దానికి ఒకరోజు ముందుగానే ఈ నెల 27న తెరపైకి తీసుకొచ్చేందుకు నిర్మాతలు నిర్ణయించినట్లు సమాచారం. త్వరలో దీనిపై స్పష్టత రానుంది.






## పెద్ది మూవీలో జాన్వీ లుక్స్ అదుర్స్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న పెద్ది చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగు తోంది. ప్రస్తుతం శ్రీలంకలో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు మేకర్స్. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా నుంచి కథానాయికగా నటిస్తున్న బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ ఫస్ట్ లుక్‌ని చిత్రబృందం విడుదల చేసింది. ఈ చిత్రంలో జాన్వీ అచ్చియమ్మా అనే పాత్రలో కనిపించబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఇందులో జాన్వీ క్రికెట్ కామెంటేటర్‌గా కనిపించనుంది. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా వచ్చే మార్చి 27న విడుదల కానుంది. ఆయన టైటిల్ పాత్రలో నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ కథానాయిక. శివ రాజ్‌కుమార్, దివ్యేందు శర్మ, జగపతిబాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా నుంచి తొలి పాట వినిపించేందుకు చిత్ర బృందం సిద్ధమవుతోంది. ఈ నెల 8న రామోజీ ఫిల్మ్ సిటీలో జరగనున్న ఏఆర్ రెహమాన్ లైవ్ కాన్సెర్ట్‌లోనే ఈ చిత్ర తొలి గీతాన్ని వినిపిచేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు దర్శకుడు బుచ్చిబాబు సామాజిక మాధ్యమాల వేదికగా సంకేతాలు అందించారు. ఆటలతో ముడిపడి ఉన్న బలమైన భావోద్వేగాలు నిండిన కథతో ఈ సినిమా ముస్తాబవుతోంది. దీనికి రెహమాన్ సంగీతమందిస్తుండగా.. రత్నవేలు ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో రామ్ చరణ్‌తో పాటు కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు.

## సల్మాన్‌తో దిల్‌రాజ్ మూవీ?

టాలీవుడ్ ప్రముఖ నిర్మాత దిల్ రాజు మరోసారి భారీ స్థాయిలో సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నారు. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌తో పాటు దిల్ రాజు డ్రీమ్స్ అనే కొత్త విభాగం ద్వారా యంగ్ టాలెంట్‌కి అవకాశాలు కల్పిస్తూ బిజీగా ఉన్నారు. ఇటీవల గేమ్ ఛేంజర్ ,సంక్రాంతికి వస్తున్నాం చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన దిల్ రాజు, ఇప్పుడు మరోసారి ప్యాన్‌ఇండియా స్థాయిలో ప్రాజెక్ట్‌లు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే టాలీవుడ్‌లో పలు బడా హీరోలతో సినిమాలు తెరకెక్కించే ప్రణాళికలో ఉన్న ఆయన, ఈసారి బాలీవుడ్ వైపు దృష్టి సారించారు. బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్ ఖాన్‌తో భారీ చిత్రాన్ని నిర్మించేందుకు సిద్ధమవుతున్నారని సమాచారం. ఈ ప్రాజెక్ట్‌కు టాలీవుడ్ టాప్ డైరెక్టర్ వంశీ పైడిపల్లి దర్శకత్వం వహించనున్నారని వినికిడి. వీరిద్దరి కాంబినేషన్‌లో క్లాస్ టచ్‌తో కూడిన మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ రూపుదిద్దుకోనుందని టాక్. ఇప్పటికే సల్మాన్ ఖాన్ స్క్రిప్ట్‌ను విని గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని, షూటింగ్ వచ్చే ఏడాది ప్రారంభం కానుందని సమాచారం. ఈ చిత్రానికి సంబంధించిన నటీనటుల ఎంపిక, టెక్నీషియన్ల వివరాలు త్వరలో అధికారికంగా ప్రకటించనున్నారు. ఇక సల్మాన్ రెమ్యునరేషన్ విషయానికి వస్తే .. ఈసారి లాభాల్లో వాటా తీసుకోవడానికి అంగీకరించారని వార్తలు వస్తున్నాయి. దిల్ రాజు ఈ ప్రాజెక్ట్‌ను భారీ బ్జడెట్‌తో నిర్మించాలనుకుంటున్నారని, సినిమాని ప్యాన్‌ఇండియా లెవెల్‌లో విడుదల చేయాలనే లక్ష్యంతో ఉన్నారని టాక్. గతంలో హిట్, జెర్సీ వంటి సక్సెస్‌ఫుల్ రీమేక్‌లతో బాలీవుడ్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్న దిల్ రాజు, ఇప్పుడు సల్మాన్ ఖాన్‌తో కలిసి మళ్లీ బాలీవుడ్ మార్కెట్‌లో తన ముద్ర వేయడానికి రెడీ అవుతున్నారు.



Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com